సోమవారం
15-05-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 322
పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మోచా బీభత్సం

శక్తిమంతమైన మోచా తుపాను బంగ్లాదేశ్, మైన్మార్‌లో బీభత్సం సృష్టించింది. మైన్మార్ వెంబడి తీరం దాటగా, బంగ్లాదేశ్‌పై తీవ్ర ప్రభావం చూపింది. గంటకు 209 కిమీల వేగంతో వీచిన తీవ్రగాలులకు అనేకచోట్ల చెట్లు వేరులతో సహా విరిగిపడ్డాయి. ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి.

2లో

సీబీఐ కొత్త డైరెక్టర్ ప్రవీణ్ సూద్

న్యూఢిల్లీ: సీబీఐ డైరెక్టర్‌గా కర్నాటక డీజీపీ ప్రవీణ్ సూద్ (59) నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులు ఆదివారం జారీ అయ్యాయి. ఈనెల 25వ తేదీతో సుబోధ్ కుమార్ జైశ్వాల్ పదవీ కాలం ముగియనున్నది. ఆ తర్వాత నుంచి రెండేళ్ల వరకు సీబీఐ డైరెక్టర్‌గా ప్రవీణ్ సూద్ ఉంటారని అధికారులు తెలిపారు. ప్రవీణ్ సూద్ కర్నాటక కేడర్ 1986 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. జైశ్వాల్ తర్వాత ఐపీఎస్ సీనియర్ అధికారి. ప్రధాని మోదీ, సీజేఐ డీవై చంద్రచూడ్, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అధిర్ రంజన్ చౌదరిలతో కూడిన ఉన్నతస్థాయి కమిటీ శనివారం భేటీ అయి ప్రవీణ్ సూద్ నియామకాన్ని ఆమోదించింది. అయితే అధిర్ రంజన్ చౌదరి (కాంగ్రెస్ నేత) ఈ నిర్ణయానికి సమ్మతి తెలపలేదని తెలుస్తోంది. కాగా, ప్రవీణ్ సూద్ ఐఐటీ దిల్లీ, ఐఐఎం బెంగళూరు, న్యూయార్క్‌లోని సైరకూస్ యూనివర్సిటీలో విద్యను అభ్యసించారు. 2024లో పదవీ విరమణ పొందాల్సిన ఆయన ఇప్పుడు రెండేళ్లు కొత్త బాధ్యతలు నిర్వర్తిస్తారు. ప్రవీణ్ సూద్ బళ్లారి, రాయ్‌చూర్ జిల్లాల ఎస్పీగా, బెంగలూరు నగర పోలీసు డిప్యూటీ కమిషనర్‌గా అదనపు సీపీ (ట్రాఫిక్)గా, మైసూరు నగర సీపీగానూ పనిచేశారు. మారిషస్ ప్రభుత్వానికి పోలీసు

- మిగతా 2 లో

సీఎంపై ఉత్కంఠే

అధిష్ఠానానిదే నిర్ణయం: సీఎల్పీ ఏకగ్రీవ తీర్మానం

18న సీఎం, మంత్రివర్గం ప్రమాణ స్వీకారం

బెంగళూరు: కర్నాటకలో అఖండ విజయాన్ని సాధించిన కాంగ్రెస్ పార్టీ త్వరలోనే ఆ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇదే క్రమంలో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోయేది ఎవరన్న ఉత్కంఠ కొనసాగుతోంది. ఆదివారం బెంగళూరులోని 5స్టార్ హోటల్‌లో సీఎల్పీ సమావేశం జరిగింది. సీఎం అభ్యర్థిని ఎంపిక చేసే బాధ్యతను పార్టీ అధినేతకు అప్పగిస్తూ తీర్మానం చేసే సంప్రదాయం కాంగ్రెస్‌లో ఉంది. తాజాగా అదే జరిగింది. కాంగ్రెస్ శాసనసభాపక్ష నాయకుడిని నియమించే చేసే బాధ్యతను ఏఐసీసీ అధ్యక్షునికి అప్పగిస్తూ సీఎల్పీ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. సీఎం ఎవరో వెల్లడించకుండా ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం తేదీని కాంగ్రెస్ ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. కొత్త సీఎంతో పాటు నూతన మంత్రివర్గం గురువారం ప్రమాణ స్వీకారం చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి భావసారుప్యత కలిగిన పార్టీలకు సైతం కాంగ్రెస్ ఆహ్వానాలు సైతం పంపిస్తున్నట్టు తెలుస్తోంది. కర్నాటక మంత్రివర్గం కూర్పునకు ఒకట్రెండు రోజుల్లో తుది రూపం వచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. ప్రమాణ స్వీకారోత్సవానికి అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖడ్గే తదితరులు హాజరుకానున్నారు. మరోవైపు సీఎం అభ్యర్థి ఎంపిక కోసం కాంగ్రెస్ అధిష్ఠానం ముగ్గురు నేతలతో కూడిన పరిశీలకుల బృందాన్ని బెంగళూరుకు పంపింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు సుశీల్ కుమార్ షిండే, దీపక్ బాబరియా, జితేంద్ర సింగ్ అల్వార్‌ను పరిశీలకులుగా కర్నాటక సీఎల్పీ నియమించింది. ముఖ్యమంత్రి ఎవరన్న అంశంపై చివరి నిర్ణయాన్ని అధ్యక్షుడికి వదిలేస్తూ తీర్మానించింది.

సరైన నిర్ణయమే తీసుకుంటాం: ఖడ్గే

కర్నాటక ముఖ్యమంత్రి ఎవరన్నది పార్టీ అధిష్ఠానమే నిర్ణయిస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లకార్జున ఖడ్గే తెలిపారు. సీఎం అభ్యర్థి విషయంలో వివాదం లేదని అన్నారు. కర్నాటకలోని పార్టీ ఎమ్మెల్యేల అభిప్రాయాలను ఏఐసీసీ పరిశీలకులు అధిష్ఠానానికి తెలియజేస్తారని, ఆపై తుది నిర్ణయం

- మిగతా 2 లో

చంద్రబాబు నివాసగృహం

జప్తు

- రింగ్‌రోడ్ అలైన్‌మెంట్ మార్పులో అవకతవకలు
- ప్రతిఫలంగా గెస్ట్‌హౌస్ తీసుకున్నారని ప్రభుత్వ అభియోగం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : కృష్ణా నది కరకట్టపై చంద్రబాబు గెస్ట్ హౌస్‌ను రాష్ట్ర ప్రభుత్వం అటాచ్ చేసింది. క్రిమినల్ లా అమెండ్‌మెంట్ 1994 చట్టం ప్రకారం ఆర్థిక నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపిస్తూ, స్థానిక జడ్జికి సమాచారం ఇస్తూ లింగమనేని గెస్ట్ హౌస్‌ను అటాచ్ చేసింది. ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ మార్పు చేశారని అభియోగం మోపారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు, మంత్రిగా నారాయణ పదవుల దుర్వినియోగానికి, క్విడ్‌ప్రోకోకు పాల్పడ్డారన్న కేసుల విచారణ నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. సీఆర్డీఏ మాస్టర్ ప్లాన్, ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్లలో అవకతవకలు జరిగాయని, దానికి బదులుగా చంద్రబాబు కరకట్టపై లింగమనేని గెస్ట్ హౌస్ పొందారని ప్రభుత్వం అభియోగం మోపింది. చట్టాలు, కేంద్ర విజిలెన్స్ కమిషన్ మార్గదర్శకాలను, సాధారణ ఆర్థిక నియమాలను ఉల్లంఘించినట్టు ప్రభుత్వం నిర్ధారించింది. తమ పదవులను ఉపయోగించుకుని బంధువులకు, స్నేహితులకు ప్రయోజనాలు కల్పించారని, వ్యాపారి లింగమనేనికి అనుకూలంగా వ్యవహరించి... ప్రతిఫలంగా గెస్ట్ హౌస్ తీసుకున్నారని చంద్రబాబుపై అభియోగం మోపింది. గతంలో ఇదే గెస్ట్ హౌస్‌ను నదీపరివాహక ప్రాంతంలో ఉందని ప్రభుత్వం నోటీసులు ఇచ్చింది. పక్కనే ఉన్న ప్రజా వేదికను కూల్చివేసింది. చంద్రబాబు నివాస గృహం పక్కనే నదీ తీరం వెంబడి మంతెన సత్యనారాయణ ఆశ్రమంతో పాటు ఇంకా అనేక మంది ప్రముఖుల గెస్ట్‌హౌస్‌లు ఉన్నప్పటికీ ప్రభుత్వం వాటి జోలికి వెళ్లలేదు.

జగన్నాటకంలో అంతర్భాగమే ఇది : టీడీపీ

జగన్‌ది విధ్వంస పాలనేగానీ... ఆయన ప్రభుత్వం నిర్మాణాత్మక ప్రభుత్వం కాదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. జగన్ పాలన ప్రారంభించిన రోజుల్లోనే ప్రజా ఉపయోగమైన 'ప్రజాదర్బార్' ను కూలగొట్టి రాష్ట్ర ఖజానాకు నష్టం తెచ్చారు. ఇదే ప్రజా దర్బార్‌ను ప్రజా ఉపయోగాలకు వినియోగించి ఉండొచ్చు. నేరం జరగకపోయినా, రాజకీయ దురుద్దేశంతో సీఐడీని తన ఆధీనంలోకి తీసుకొని చంద్రబాబు, నారాయణ, లింగమనేని రమేష్ తదితరులపై క్రైమ్ 16/22 రిజిస్టర్ చేసి వారిని ఇబ్బంది పెడుతున్నారని వర్ల రామయ్య ఆదివారం మీడియా సమావేశంలో ఆరోపించారు. రేపో మాపో అరెస్టు కాబోతున్న మీ తమ్ముడు అవినాష్ రెడ్డి అరెస్టుపై ప్రజల దృష్టిని మరల్చడం కోసమే ఈ జప్తు నాటకమని అన్నారు. అమరావతి రాజధానిలో ఇన్నర్ రింగ్ రోడ్ పనులే మొదలుపెట్టలేదని, ఇక అవినీతి ఎక్కడుంటుందో ముఖ్యమంత్రే చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లింగమనేని రమేష్ భూములన్నీ ప్రతిపాదిత ఐఆర్‌ఆర్‌కు 4 నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. అటువంటప్పుడు ఆయన అతిగా లబ్ధి పొందడానికి అవకాశమెక్కడ ఉంటుంది? ఈ కేసులో నష్టపోయినవారెవరు మీకు ఫిర్యాదు ఇవ్వలేదు.

నేరమూ జరగలేదు, ఫిర్యాదు ఇచ్చిన బాధితులు ఎవరూ లేరు, మీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి రిపోర్టు ఇస్తే ప్రతిపక్షాలను ఇబ్బంది పెడతారా? ఇది కక్ష సాధింపు కాకపోతే మరేంటి? ఇది మీ అరాచక, అస్తవ్యస్థ, రాజకీయ కక్షపూరిత పాలనకు నిదర్శనం కాదా? అని వర్ల మండిపడ్డారు. వ్యక్తిగత కక్షతో ఈ ప్రభుత్వం నడుస్తోందని, భవిష్యత్తులో ఈ ప్రభుత్వం బొక్కబోర్లా పడటం ఖాయమని హెచ్చరించారు.

పోలవరానికి కేంద్రం

అన్యాయం

- ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించాలి
- అఖిల పక్షాలను కలుపుకుని సీఎం కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- సీపీఐ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ అన్యాయం చేస్తోందని వక్తలు అన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి అధ్వర్యంలో ఇక్కడి దాసరి భవన్‌లో 'పోలవరం నిర్మాణానికి నిధులు కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోంది' అనే అంశంపై అన్ని రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, విద్యార్థి, యువజన, మహిళా సంఘాలు, ఇతర ప్రజాసంఘాలను ఆహ్వానిస్తూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అధ్యక్షతన ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ఇరిగేషన్ ప్రధాన కార్యదర్శి శశి భూషణ్ కుమార్ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.29,374 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారని అన్నారు. అయితే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు కేటాయించకుండా పూర్తి నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. కేంద్రం పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.1,429 కోట్లు మాత్రమే మంజూరు చేస్తామని స్పష్టంగా చెబుతోందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఈ విషయంపై ఏమి మాట్లాడటం లేదని, ప్రస్తావన కూడా చేయటం లేదని, అన్ని పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేయడం లేదని, కేవలం తనకు సంబంధించిన కేసులపై లాబీయింగ్ చేస్తున్నాడని తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఈ విషయంపై అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలని, లేదంటే రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన వారుగా, చరిత్ర హీనులుగా నిలిచిపోతారని అన్నారు. నరేంద్ర మోదీ, బీజేపీ పట్ల ప్రజలలో ఉన్న వ్యతిరేకత కర్నాటక ఎన్నికల ఫలితాల్లో స్పష్టమైందని తెలిపారు. ఇప్పటికైనా అన్ని రాజకీయ పార్టీలు పోలవరం ప్రాజెక్టు నిర్మాణ నిధుల కోసం ఐక్య ఉద్యమాలకు కలిసి రావాలని పిలుపునిచ్చారు. సామాజిక విశ్లేషకులు

- మిగతా 2 లో

బీజేపీ ఓటమికి ఉమ్మడి వ్యూహమే కీలకం

డి.రాజా, శరద్ పవార్

ముంబై: బీజేపీని ఓడించేందుకు ఉమ్మడి వ్యూహం అవశ్యమని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. రాజా ఆదివారం ఎన్‌సీపీ అధ్యక్షుడు శరద్ పవార్‌తో ఆయన ముంబై నివాసంలో భేటీ అయ్యారు. బీజేపీకి ప్రత్యామ్నాయం కల్పించే అంశమై చర్చించారు. కర్నాటక ఎన్నికల్లో కాషాయ పార్టీ ఓటమి దృష్ట్యా ఆ రాష్ట్రంలో అమలు చేసిన విధానాన్నే మిగతా రాష్ట్రాల్లోనూ అమలు చేయొచ్చని, అందుకోసం భావసారూప్యతగల అన్ని పార్టీలు కనీస ఉమ్మడి కార్యక్రమం (సీఎంపీ)తో ముందుకెళ్లడం ముఖ్యమని ఇద్దరు నేతలు అంగీకరించారు. రాజాతో భేటీ అనంతరం పవార్ విలేకరులతో మాట్లాడుతూ 'కర్నాటక ఎన్నికలు స్పష్టమైన సందేశాన్ని ఇచ్చాయి. మనం ఇతర రాష్ట్రాల్లోనూ కర్నాటక తరహా పరిస్థితిని సృష్టించగలగాలి. కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ

- మిగతా 2 లో

శ్రద్ధాంజలి

వల్లంకొండ శేషగిరిరావు గారు

అనురాగం, అప్యాయత మంచితనానికి మారుపేరుగా నిలిచిన మీ నిష్క్రమణం మాకు తీరనిలోటు మీ జ్ఞాపకాలు మా మదిలో ఎల్లప్పుడూ మెదులుతూనే ఉంటాయి. మీ పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ ....

అమరజీవి కామ్రేడ్
వల్లంకొండ శేషగిరిరావు గారు
జననం: 01-06-1956
మరణం: 03-05-2023
అనిగండ్లపాడు గ్రామం పెనుగంచిప్రోలు మండలం
ఎన్.టి.ఆర్.జిల్లా.

భార్య : వల్లంకొండ నిర్మల
కుమారుడు: వల్లంకొండ భాస్కరరావు
కోడలు: వల్లంకొండ లక్ష్మీ
కూతురు: కంకణంపాటి సుజాత
అల్లుడు : కంకణంపాటి శ్రీనివాసరావు
అన్నగారు : వల్లంకొండ బ్రహ్మాం

వల్లంకొండ బ్రదర్స్
వల్లంకొండ శ్రీనివాసరావు
వల్లంకొండ నరసింహారావు
వల్లంకొండ భాస్కరరావు (బుజ్జి)
వల్లంకొండ చంద్రశేఖర్
వల్లంకొండ పెదభాస్కరరావు
వల్లంకొండ బసవయ్య
వల్లంకొండ చిన్న భాస్కరరావు
వల్లంకొండ భూపేష్

వల్లంకొండ సిస్టర్స్
వల్లంకొండ అరుణ
వల్లంకొండ రేణుక
వల్లంకొండ శ్రీలక్ష్మి
గుంటుపల్లి అరుణ

మనువళ్ళు & మనుమరాళ్ళు

పెద్దకర్మ : 15-05-2023 సోమవారం అనిగండ్లపాడు గ్రామంలోని మా స్వగృహమందు జరుగును.

ఇదీ లోకం!

మీరే నంబర్ వన్ అన్నారా?!

దేశవ్యాప్తంగా బీజేపీ ఓటమే లక్ష్యం

మోదీ వినాశకర విధానాలతో ప్రజలు విసిగిపోయారు

సీపీఐ కార్యదర్శి నారాయణ

2లో

మోచా బీభత్సం

- మైన్మార్‌లో తీరం దాటిన తుపాను
- బంగ్లాదేశ్‌పైనా ప్రభావం
- గంటకు 209కిమీల వేగంతో తీవ్రగాలులు
- నిలిచిన విద్యుత్, టెలిఫోన్, ఇంటర్నెట్ సేవలు
- వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

ధాకా: శక్తిమంతమైన మోచా తుపాను బంగ్లాదేశ్, మైన్మార్‌లో బీభత్సం సృష్టించింది. మైన్మార్ వెంబడి తీరం దాటగా, బంగ్లాదేశ్‌పై తీవ్ర ప్రభావం చూపింది. గంటకు 209 కిమీల వేగంతో వీచిన తీవ్రగాలులకు అనేకచోట్ల చెట్లు వేరులతో సహా విరిగిపడ్డాయి. ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. టెలిఫోన్, విద్యుత్, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. మొబైల్ టవర్లు సైతం కూలిపోయాయి. వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఆస్తినష్టంతో పాటు ప్రాణనష్టం తీవ్రంగానే ఉంటుందన్న అంచనా ఉన్నది. మైన్మార్‌లో 20 లక్షల మందికి ముప్పు ఉన్నట్లు ఐరాస ప్రతినిధి ఒకరు తెలిపారు. బాధితుల కోసం అత్యవసర సేవలకు సంసిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. నష్టం భారీగా ఉండబోతోందని హెచ్చరించారు. మూడువేల మందికిపైగా మైర్మార్‌లోని పగోడాలు, మఠాలు, స్కూళ్లలో ఆశ్రయం పొందారు. మోచా తుపాను మధ్యాహ్నం సమయంలో మైన్మార్, రఖినే రాష్ట్రం సమీపంలోని సిట్వే పట్టణం వద్ద తీరం దాటినట్లు మైన్మార్ వాతావరణ శాఖ తెలిపింది. భారీ వర్షం, తీవ్రగాలలతో విధ్వంసం సృష్టించినట్లు వెల్లడించారు. తచిలేక్ పట్టణంలో వర్షానికి కొండచరియలు విరిగిపడి ఓ జంట సజీవసమాధి కాగా, చెట్లు కింద ఓ వ్యక్తి నలికిపోయిన ఘటన మాండలే ప్రాంతంలో చోటుచేసుకుంది. బంగ్లాదేశ్‌లోనూ గంటకు 195 నుంచి 200 కిమీల వేగంతో గాలులు వీచాయి. భారీ వర్షం కురిసింది. కోగ్స్ బజారుపై తుపాను తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. అక్కడ నుంచి 1.27 మిలియన్ల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఈ తుపాను వల్ల బంగ్లాదేశ్‌కు నష్టతీవ్రత తక్కువగా ఉండవచ్చని ధాకాలోని వాతావరణ శాఖ డైరెక్టర్ రెహమాన్ అన్నారు. ఫెనీ, నయోఖలి, లక్ష్మంపూర్, చాంద్పూర్, భోలా, చత్తోగ్రామ్ ప్రాంతాలపై తుపాను ప్రభావం ఉంటుందన్న అంచనా ఉన్నది. ఇప్పటికే 5,00,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు బంగ్లాదేశ్ ప్రభుత్వం పేర్కొంది. మత్స్యకారులను వేటకు వెళ్లకుండా నిలువరించినట్లు తెలిపింది. విమానాశ్రయాలను మూసివేసినట్లు వెల్లడించింది. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా ఆహారం, వైద్యసేవలను అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది. కాగా, బంగాళాఖాతంలోని సెయింట్ మార్టిన్స్ ద్వీపంలో శక్తిమంతమైన గాలలతో వర్షం కురిసిందని జమునా టీవీ స్టేషన్ నివేదించింది.

'ఆర్మీ' పార్టీ పెట్టుకుంటే సరి!

- రాజకీయాలు చేసుకోండి
- సైన్యాధికారి తీరుపై ఇమ్రాన్ ఘాటు విమర్శలు
- అల్లర్ల వెనుక 'అధికార' హస్తం ఉన్నదని పీటీఐ చీఫ్ వ్యాఖ్య

లాహోర్: తన అరెస్టు క్రమంలో చోటుచేసుకున్న పరిణామాల క్రమంలో ఆర్మీ పార్టీ పెట్టుకొని రాజకీయాలు చేసుకుంటే బాగుంటుందని పీటీఐ అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్ ఎద్దేవా చేశారు. నిజమైన స్వాతంత్ర్యాన్ని (హకీకతీ ఆజాదీ)ని పోరాడి సాధించుకోవాలని పాకిస్తాన్ ప్రజలకు పిలుపునిచ్చారు. పైవారి నుంచి అనైతిక ఆదేశాలు తీసుకోవడం మానుకోవాలని పోలీసులు, జడ్జిలతో సహా ప్రభుత్వాధికారులకు సూచన చేశారు. తన అరెస్టు నేపథ్యంలో జరిగిన ఆందోళనలు హింసాత్మకంగా మారడం వెనుక 'అధికార' హస్తం ఉన్నదని ఆరోపించారు. దేశాన్ని పూర్తిగా గందరగోళంలోకి నెట్టివేయకుండా సొంతంగా పార్టీని ఏర్పాటు చేసుకొని రాజకీయాల్లో రావాలని పాకిస్తాన్ సైన్యంపై పీటీఐ చైర్మన్ ఇమ్రాన్ ఖాన్ మండిపడ్డారు. సైన్యం తీసుకునే చర్యలు దేశాన్ని విపత్తు అంచునకు తెచ్చాయన్నారు. ఇస్లామబాద్ కోర్టు ఉత్తర్వుల మేరకు విడుదలైన తర్వాత ఇమ్రాన్ ఖాన్ వీడియో లింక్ ద్వారా దేశాన్ని ఉద్దేశించి తొలిసారి ప్రసంగించారు.

అప్పటికి మీరింకా పుట్టనేలేదు...

తనపై ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పీఆర్) ఆరోపణలను ఇమ్రాన్ ఖాన్ తోసిపుచ్చారు. 'పాకిస్తాన్‌కు నేను ప్రాతినిధ్యం వహించినప్పుడు మీరు (సంస్థ డైరెక్టర్ అహ్మద్ హరీఫ్ చౌధురిని ఉద్దేశించి) పుట్టలేదు. కపటవేషధారని, ఆర్మీ వ్యతిరేకినని మాట్లాడినందుకు మీరు సిగ్గుపడాలి. మిలిటరీ మీడియా విభాగం ఐఎస్‌పీఆర్ ఎప్పుడూ ఇలాంటి మాటలు (రాజకీయ నాయకుడి గురించి) మాట్లాడలేదు. 'మీరు రాజకీయాల్లోకి ఎందుకు రాకూడదు... సొంత పార్టీ ఎందుకు పెట్టుకోకూడదు. పనికిమాలిన ఆరోపణలు చేసే హక్కు ఎవరిచ్చారు. సైన్యానికి ఎవరూ నేను చేసినంత హాని తలపెట్టలేదన్నందుకు సిగ్గుగా లేదా? నేను ప్రధానిగా ఉన్నప్పుడు పాకిస్తాన్ సైన్యాన్ని ప్రజలు ఇష్టపడేవారు కానీ మాజీ జనరల్ కమర్ జావేద్ బజ్వా నాకు వెన్నుపోటు పొడిచిన పర్యవసానంగా అవినీతిపరులకు అధికారం దక్కిన తర్వాత నుంచి సైన్యంపై విమర్శలు మొదలయ్యాయి' అని ఇమ్రాన్ ఖాన్ అన్నారు.

హింసపై స్వతంత్ర విచారణ జరపించాలి...

తన అరెస్టు తర్వాత చోటుచేసుకున్న హింస, ఆందోళనలు, విధ్వంసకాండపై స్వతంత్ర దర్యాప్తును ప్రధాన న్యాయమూర్తి ఉమర్ అతా బండియల్ నేతృత్వంలో జరిపించాలని ఇమ్రాన్ ఖాన్ డిమాండ్ చేశారు. బలవంతంగా ఏదేని రాజకీయ పార్టీని రద్దు చేయలేరన్నారు. నిరాయుధ యువత శాంతియుతంగా ఆందోళనలు చేస్తుంటే వారిపై కాల్పులు జరిపి అనేక మంది ప్రాణాలను హరించారని, బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామన్నారు. కార్ప్స్ కమాండర్స్ ఇంటికి శాంతియుతంగా నిరసన తెలిపేవారు వెళ్లకుండా సైన్యంగానీ పోలీసులుగానీ ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. కొందరు ఆందోళనకారుల ముసుగులో జిన్నాహౌస్‌కు నిప్పుపెట్టారని ఆరోపించారు. జర్నలిస్టులను నిర్బంధించి వేధించారన్నారు. జనమంతా వీధుల్లోకి రావాల్సిందేనని, 'నిజమైన స్వాతంత్ర్యం', రాజ్యాంగాన్ని, పాకిస్తాన్‌ను పరిరక్షణ కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

145 అక్రమ కేసులు...

50ఏళ్ల ప్రజా జీవితంలో తనపై ఒక్క కేసు లేదని, ప్రస్తుత పాలనలో 145 కేసులు నమోదయ్యాయని, అందులో ఉగ్రవాదం, ముట్టడి కేసులు కూడా ఉన్నాయని ఇమ్రాన్ ఖాన్ అన్నారు. దేశంలో వాక్ స్వేచ్ఛ, భావ ప్రకటన స్వేచ్ఛ లేవని, సామాజిక మాధ్యమాలపైనా నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయని చెప్పారు. దేశంలో అనిశ్చితిని ఎవరు సృష్టించాలని అనుకుంటున్నదని తెలుసునని, పాకిస్తాన్ ఆశలన్నీ న్యాయ వ్యవస్థపైనే అన్నారు. సైన్యానికి భయపడకుండా మనస్సాక్షితో వార్తలు అందించాలని జర్నలిస్టులను కోరారు. తనకు 145 కేసుల్లో ఉపశమనం లభించడంలో పాలకుల వెన్నులో వణుకు పుట్టిందని వ్యాఖ్యానించారు.

17 నుంచి ర్యాలీలు

బుధవారం నుంచి తాను ర్యాలీలు చేపట్టనున్నట్లు ఇమ్రాన్ ప్రకటించారు. పాలకుల నుంచి అనైతిక ఆదేశాలను స్వీకరించొద్దని పోలీసులు, న్యాయమూర్తులు, పాత్రికేయులు, ఇతర ప్రభుత్వ అధికారులకు ఇమ్రాన్ పిలుపునిచ్చారు.

పోలవరానికి కేంద్రం అన్యాయం

(మొదటిపేజీ తరువాయి)

లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పోలవరానికి రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని అన్నారు. మొదటి దశ పేరుతో 45.72 మీటర్ల కాంటూరు నుంచి 41.15 మీటర్ల ఎత్తు తగ్గించాలనడంతో జాతీయ ప్రాజెక్టు పోలవరం మినీ ప్రాజెక్టుగా మారిపోతుందన్నారు. దీనివల్ల ప్రాజెక్టు నీటి నిల్వ 196.60 టీఎంసీల నుంచి 92 టీఎంసీలకు పరిమితం అవుతుందని తెలిపారు. ఇక రెండో దశ ప్రస్తావనే లేదని అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు తాగు, సాగు నీరు అందించటంతో పాటు పరిశ్రమల అవసరాలకు నీటిని అందించగలుగుతామని చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణంతో ముంపు బాధితులకు పరిహారం, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వకుండా, ఎత్తును 135 అడుగులకు కుదించి, నిర్వాసితులకు ఇవ్వవలసిన రూ.30 వేల కోట్లను ఎగ్గొట్టేందుకు ప్రయత్నిస్తోందన్నారు. రైతు సంఘం నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ పోలవరం జాతీయ ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించపోగా కేంద్ర ప్రభుత్వం రకరకాల ప్రకటనలు చేస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తోందని అన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టుకు రావలసిన నిధులను కేంద్ర కేబినెట్ ఆమోదించడం లేదని తెలిపారు.

రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు తాగు, సాగు నీరు అందించడం ద్వారా రాష్ట్ర ప్రయోజనాలు ఇమిడి ఉంటాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏపీకి పదేపదే అన్యాయం చేస్తున్నా జగన్ నోరు విప్పట్లేదన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ కేంద్రంలో విధ్వంస కారులు, రాష్ట్రంలో కక్షపూరిత దారులు పరిపాలన కొనసాగిస్తున్నారని అన్నారు. వీరిని ఎదుర్కోవాలంటే ఎన్నికలే అజెండాగా, ఐక్య ఉద్యమాలతో సాధించవచ్చని సూచించారు. ఈ సమావేశంలో పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి నిర్మించాలి, రాష్ట్ర ప్రభుత్వం అన్ని పక్షాలను కలుపుకొని కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించారు. ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ వందన సమర్పణ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్, అక్కినేని వనజ, దేగా ప్రభాకర్, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర, కాంగ్రెస్ పార్టీ విజయవాడ నగర అధ్యక్షులు నరహరశెట్టి నరసింహారావు, ప్రజా సంఘాల నాయకులు ఆళ్ల గోపాలకృష్ణ, డి.హరినాథ్, పోతుల బాలకోటయ్య, ఎస్.కె.ఖాదర్ బాషా, ఏపీపీఎఫ్ కన్వీనర్ నేతి మహేశ్వరరావు, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కేవీబీ వీర వరప్రసాద్, ఏఐసీసీటీయూ నాయకులు ఈశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు కొలనుకొండ శివాజీ, కనకం శ్రీనివాసరావు, జి.ఎస్.ప్రసాద్, రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు, లోక్‌సత్తా నాయకులు వెంకటరమణ, పోలవరం ముంపు ప్రాంత నాయకులు మన్నవ కృష్ణ చైతన్య, మైసాక్షి వెంకటాచారి, ఎండీ మునీర్, కారం ధరయ్య, బాడిస రాము తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓటమికి ఉమ్మడి వ్యూహమే కీలకం

(మొదటిపేజీ తరువాయి)

ఒంటరిగానే బీజేపీకి ప్రత్యామ్నాయాన్ని అందించింది. ఇతర రాష్ట్రాల్లో భాగసారూప్యతగల పార్టీలు సీఎంపీకి కృషిచేయాలి. దీనిపైనే రాజా, నేను చర్చించాం' అని అన్నారు. కర్నాటక తరహా వ్యూహరచన ప్రక్రియ ఇప్పటికే మొదలైందన్నారు. 'రాష్ట్రస్థాయి వ్యూహం ఫలించవచ్చు. దిల్లీలో చర్చలకు కొంత సమయం ప్రస్తుతం లభిస్తుంది. బీజేపీ అజేయపార్టీ కాదు. మహారాష్ట్ర ఎన్నికలతో పాటు 2024 పార్లమెంటరీ ఎన్నికల్లోనూ ఆ పార్టీ ఓడిపోతుంది' అని పవార్ అన్నారు. కర్నాటకలో కాంగ్రెస్ 135 స్థానాల్లో గెలిచి బీజేపీని 66 స్థానాలకు పరిమితం చేసిన విషయం విదితమే.

సీబీఐ కొత్త డైరెక్టర్ ప్రవీణ్ సూద్

(మొదటిపేజీ తరువాయి)

సలహాదారుగానూ వ్యవహరించారు. ట్రాఫిక్ నిర్వహణ, పౌరులకు సమర్థ సేవలు అందించడంలో టెక్నాలజీ వినియోగానికిగాను నేషనల్ ఇ-గవర్నెన్స్ గోల్డ్ అవార్డ్‌ను 2011లో పొందారు. ప్రిన్స్ మైఖెల్ ఇంటర్నేషనల్ రోడ్ సేఫ్టీ అవార్డును 2006లో ప్రవీణ్ సూద్ అందుకున్నారు.

దేశవ్యాప్తంగా బీజేపీ ఓటమే లక్ష్యం

విశాలాంధ్ర-హైదరాబాద్: విధ్వంసకర రాజకీయాలు చేస్తున్న బీజేపీని దేశవ్యాప్తంగా ఓడించడమే తమ పార్టీ లక్ష్యం అని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యదర్శి డాక్టరు కె. నారాయణ తెలిపారు. ఈ లక్ష్యంలో భాగంగా ఏప్రిల్ 14 నుంచి మే 15 వరకు నెల రోజులు దేశంలోని అన్ని రాష్ట్రాలలోని మహానగరాలు, పట్టణాలు, గ్రామాలలో "బీజేపీ హఠావో - దేశ్ బచావో" నినాదంతో పాదయాత్రలు నిర్వహించి బీజేపీ ప్రజా వ్యతరేక, వినాశకర విధానాలను ప్రజలకు వివరించి 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని అధికారం నుంచి దించాలని విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ మూసారాం బాగ్, ఆస్మాన్ గఢ్, టీవీ టవర్, బి బ్లాక్స్, తిరుమల హిల్స్, వీకే దాగే నగర్, బ్యాంకు కాలనీ తదితర బస్తీలు, కాలనీలలో ఆదివారం సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి పాదయాత్ర నిర్వహించింది. డా. కె. నారాయణ, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటీ నరసింహ, కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రాచారి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి, రాష్ట్ర సమితి సభ్యులు బి. వెంకటేశం తోపాటు వందలాదిమంది సీపీఐ శ్రేణులు దుకాణాలు, ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచుతూ బీజేపీ ప్రజా వ్యతరేక, వినాశకర విధానాలను వివరించారు. ఈ సందర్భంగా డా. కె. నారాయణ మాట్లాడుతూ దేశమంతటా మత విషాన్ని వ్యాపింపజేస్తూ ఎలాంటి ఆహారం తీసుకోవాలి, ఎలాంటి దుస్తులు ధరించాలి అని బీజేపీ హుకుం జారీచేస్తే ప్రజలు ఊరుకోరనీ, కర్నాటకలో మాదిరిగానే దేశమంతటా తరమికొడుతారని హెచ్చరించారు. కర్నాటక అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ ప్రచారానికి మోదీ, అమిత్ షా నాయకత్వం వహించినా ఆ పార్టీ అవమానకరమైన ఓటమి చెందడం ఆ పార్టీ వినాశకర విధానాలపై ప్రజలు విసిగిపోవడం వల్లనేనన్నారు. ప్రతిపక్షాలను అణిచివేసేందుకు ఈడీ, సీబీఐ, ఐటి విభాగాలను మోదీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. ప్రధాని మోదీ తాను చేసిన హామీలన్నీ విస్మరించాడన్నారు. ప్రజలను పేదరికం, వెనుకబాటు నుంచి బయటపడవేయడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రెండు పర్యాయాలు కేంద్రంలో అధికారం చేపట్టిన బీజేపీ దేశ సంస్కృతి, నైతికత, ప్రజా సంస్థలు, ప్రజాస్వామ్య నిర్మాణం, రాజ్యాంగ విలువలకు అపారమైన నష్టం కలిగించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. లౌకికవాదం, ప్రజాస్వామ్యం, ఫెడరలిజం, రాజ్యాంగ ఆదేశాన్ని పరిరక్షించడం కోసం ప్రగతిశీల, ప్రజాసామ్యవాదులందరూ ఏకమై బీజేపీ వినాశకర విధానాలు ప్రజలకు తెలిపి, చైతన్య పరిచి వచ్చే లోక్ సభ ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించడానికి కృషి చేయాలనీ నారాయణ పిలుపునిచ్చారు. ఈటీ నరసింహ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థను నాశనం చేస్తూ బీజేపీ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ పాదయాత్రలో సీపీఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, స్టాలిన్, కార్యవర్గ సభ్యులు జి. చంద్రమోహన్, నిర్లేకంటి శ్రీకాంత్, కంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంపై ఉత్కంఠే

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రికి సంబంధించి సరైన నిర్ణయాన్నే తీసుకుంటామని ఆయన చెప్పారు.

ఎన్నికల్లో కార్యకలాపాలన్నీ సజావుగా సాగిపోయాయని, కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే ఏర్పాటవుతుందని అన్నారు. ఎవరు ఓటేశారు.. ఎవరు కాదన్న దానికి కాంగ్రెస్ ప్రాధాన్యత ఇవ్వదని, కర్నాటక ప్రజలకు సేవ చేయడమే పార్టీకి ప్రధానమని ఖర్గే నొక్కిచెప్పారు.మంత్రివర్గం కొలువుదీరిన రోజే ఎన్నికలప్పుడు ఇచ్చిన ఐదు హామీలను అమలు చేస్తామన్నారు. గతం గతహా అంటూ ఎన్నికలప్పుడు జరిగిన ఘటనలనుద్దేశించి అన్నారు. కర్నాటక రాష్ట్ర అభివృద్ధికి కృషిచేస్తామని చెప్పారు.

ఎవరి ప్రయత్నాలు వారివే...

సీఎం రేసులో ఉన్న సిద్ధరామయ్య, డీకే శివకుమార్ తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. విధేయులైన ఎమ్మెల్యేలతో విడివిడిగా చర్చలు జరుపుతున్నారు. ఇందులో భాగంగా హరిహరపుర మఠానికి చెందిన వక్కళిగ సాధువులు డీకే శివకుమార్ ఇంటికెళ్లి ఆయనను కలిశారు. తుముకూరులోని సిద్ధేశ్వర మఠాన్ని డీకే శివకుమార్ కుటుంబ సమేతంగా సందర్శించారు. మరోవైపు సిద్దరామయ్య...ఖర్గే నివాసానికి వెళ్లి ఆయనను కలిశారు.

మా నాయకుడే సీఎం కావాలి: మద్దతుదారులు

కాంగ్రెస్ సమావేశం జరిగిన హోటల్ వద్దరు ఇద్దరు సీనియర్ నాయకులు డీకే శివకుమార్, సిద్దరామయ్య మద్దతుదారులు భారీఎత్తున చేరుకొన్నారు. తమ అభిమాన నాయకుడికే ఉన్నత పదవి దక్కాలని ఇద్దరు నేతల సానుకూల వర్గాలు నినాదాలు చేశాయి. దీంతో ముఖ్యమంత్రి అభ్యర్థిపై ప్రతిష్ఠంభన మరింత జఠిలమైంది. ఓ వైపు పోస్టల జోరు కొనసాగుతోంది.

ఏపీ అగ్నిగుండం



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రం అగ్నిగుండంగా మారింది. గత వారం రోజులుగా ఎండలు నిప్పులు చెరుగుతుండగా, ఆదివారం ఎండకు తోడు వడగాడ్పులు ప్రారంభమయ్యాయి. దీంతో ప్రజలు బేజారెత్తుతున్నారు. తెల్లవారు ఝాము నుంచే వడగాడ్పులు ప్రారంభం కాగా, రాత్రి వరకు అవి కొనసాగాయి. దీంతో పగలు నిత్యం రద్దీగా ఉండే ముఖ్య నగరాల ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. మధ్యాహ్నం పూట ఏసీలు కూడా పని చేయని పరిస్థితి నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 173 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. విజయనగరం, మన్యం, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45 డిగ్రీల నుంచి 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయినట్లు అధికారులు తెలిపారు. అలాగే ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 44 డిగ్రీల నుంచి 46.5 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ముఖ్యంగా పాదచారులు, ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇక్కట్లకు లోనయ్యారు. దీనికే ప్రజలు బెంబేలెత్తుతుండగా రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల పాటు ఇదే తరహాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. సోమవారం 153 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 132 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపింది. శ్రీకాకుళం, కర్నూలు, నంద్యాల, వైఎస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 42 డిగ్రీల నుంచి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. అలాగే విజయనగరం, మన్యం, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45 డిగ్రీల నుంచి 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో కూడా అదే తరహాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని విపత్తుల సంస్థ అధికారులు తెలిపారు. ఇప్పటికే ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రభావిత జిల్లాల యంత్రాంగానికి, మండల అధికారులకు సూచనలు చేశామని, ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

ఊపందుకున్న శీతల పానీయాల విక్రయాలు

ఎండ తీవ్రతతో శీతల పానీయాల వ్యాపారాలు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. ఎండలకు భయపడి ప్రజలకు బయటకు రాకపోవడంతో మిగిలిన వ్యాపారాలన్నీ వెలవెలబోగా, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్, ఫ్రూట్ జ్యూస్, చెరుకు రసం వంటి వ్యాపారాలు వినియోగదారుల రద్దీతో కళకళలాడాయి. పుచ్చకాయలు, కొబ్బరిబోండాలకు గిరాకీ పెరిగింది. అలాగే ఏసీలు, కూలర్ల విక్రయాలు గణనీయంగా పెరిగాయి. మరోవైపు మట్టికుండలు, కూజాల అమ్మకాలు కూడా జోరుగా సాగాయి.

గిరిజన సమాఖ్య మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: జూన్ 27 నుంచి 30వ తేదీ వరకు రాయచోటిలో జరిగే ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర మూడవ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. అన్నమయ్యజిల్లా రాయచోటిలోని సిపిఐ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ, గిరిజన సమస్యలు, హక్కుల కోసం ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య పాలక పక్షాల పైన నిరంతరం పోరాటం కొనసాగిస్తున్నదని చెప్పారు. ఈ తరంలో రాష్ట్ర మూడవ మహాసభలు నాలుగు రోజులపాటు అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో జరగనున్నాయనీ, ఈ మహాసభలకు 26 జిల్లాల నుంచి గిరిజనులు వస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేశ్, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు విశ్వనాథ నాయక్, లంబాడి హక్కుల పోరాట సమితి జాతీయ నాయకులు మూడే శంకర్ నాయక్, గిరిజన సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షులు అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కార్యదర్శి రంగారెడ్డి, శివరామకృష్ణదేవరా, మహిళా సమాఖ్య నాయకురాలు సుమిత్రమ్మ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

టర్కీలో ఎన్నికలు ప్రశాంతం

ఉదయం నుంచే పోలింగ్ బూత్‌ల కిటకిట

అంకారా: టర్కీలో పార్లమెంటుతో పాటు అధ్యక్ష ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ బూత్‌లకు జనం చేరుకోవడంతో భారీ క్యూలైన్లు దర్శనమిచ్చాయి. యువ ఓటర్ల సందడి కనిపించింది. వయోవృద్ధులు, దివ్యాంగులు సైతం పోలింగ్ కేంద్రాలకు వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అంకార, ఇస్లాంబుల్‌లో అధిక పోలింగ్ నమోదైంది. దాదాపు 20ఏళ్ల తర్వాత అధికార మార్పునకు అవకాశం రావడంతో టర్కీ ప్రజలుకు ఈ ఎన్నికలు ఎంత ముఖ్యమో అర్థం చేసుకోవచ్చు. పోలింగ్ బూత్‌ల వద్ద చిన్నారుల హడావిడి కనిపించింది. ఓ రకంగా టర్కీలో ఓటింగ్ పండుగ జరిగింది. పార్లమెంటు సభ్యులతో పాటు అధ్యక్షుడిని ఎన్నుకుంటుండటంతో అక్కడి ప్రజలు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. అయితే ఓటర్లు బూత్‌లలో ఫోన్లను తీసుకెళ్లే అనుమతి లేదు. అధ్యక్ష రేసులో ఉన్న ఎర్డోగన్, కిలిక్‌దారోగ్లు, ఓగన్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. భూకంపం ప్రభావిత ప్రాంతాల్లో స్కూళ్లలో, క్యాంపుల్లో, టెంట్లలో ఓటింగ్ జరిగింది. టర్కీలో మొత్తం 64.1 మిలియన్ మంది అర్హులైన ఓటర్లు ఉన్నారు. వీరిలో 1.76 మంది విదేశాల్లో బ్యాలెట్ ఓటింగ్ చేయగా 4.9 మిలియన్ల మంది కొత్త ఓటర్లు ఉన్నారు. దేశవ్యాప్తంగా 1,91,885 బ్యాలెట్ బాక్సులను ఏర్పాటు చేశారు. ప్రతి ఓటరు రెండు ఓట్లు (ఒకటి అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు, రెండవది పార్లమెంటు సభ్యులను ఎన్నుకునేందుకు) వేశారు. ఈ పదవుల పదవీకాలం ఐదేళ్లు. కాగా, దేశంలో 30కుపైగా రాజకీయ పార్టీలున్నాయి. ఐదు కూటమలు : ది పీపుల్స్ అలయన్స్, నేషన్ అలయన్స్, ఏన్‌సెంట్రల్ అలయన్స్, లేబర్ & ఫ్రీడమ్ అలయన్స్, యూనియన్ ఆఫ్ సోషలిస్ట్ ఫోర్సెస్ అలయన్స్ ఉన్నాయి. 150 మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేశారు. టర్కీ ఎన్నికల్లో సాధారణంగా పోలింగ్ శాతం అధికంగా నమోదవుతుంది. 2018లో 87శాతం నమోదైంది. 9వేల మందికిపైగా పోలీసులు ఎన్నికల విధుల్లో ఉన్నారు.

తీవ్రస్థాయి ఉద్యమం తప్పదు

- ఇచ్చిన హామీలనే అమలు చేయమని కోరుతున్నాం
- మా డిమాండ్లు కొత్తవేమి కాదు
- ఉద్యోగసంఘ నేతలు బొప్పరాజు, పలిశెట్టి హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై తాము పోరాటం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఇక తీవ్రస్థాయి ఉద్యమానికి సిద్ధవుతున్నామని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావులు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోగా ఉద్యోగుల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 17 నుంచి దశలవారీగా 30వ తేదీ వరకు ఆందోళనలను తీవ్రతరం చేస్తామని తెలిపారు. ప్రజలు కూడా తమ ఉద్యమానికి మద్దతు తెలపాలని కోరారు. ఉద్యమాలు చేస్తున్న ఉద్యోగులను అణచివేసే కుట్రకు ప్రభుత్వం పాల్పడుతోందని, అన్ని ఉద్యోగ సంఘాలు కలిసి రావాలని, ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపిచ్చారు. మరొకసారి ఛలో విజయవాడ లాంటి ఆందోళన రాకముందే ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ఎమ్మెల్యే, ఎంపీలను కలసి ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించేందుకు సహకరించాలని కోరామన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రిటైర్డు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులెవ్వరూ కూడా సంతోషంగా లేక పోవడానికి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్యధోరణే కారణమన్నారు. ప్రస్తుత డిమాండ్లు ఏవీ కూడా ఉద్యోగుల గొంతెమ్మ కోర్కెలు కాదని, ప్రభుత్వం ఏర్పడక ముందు ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలనే అమలు చేయమని కోరుతున్నామన్నారు. ఏపీజేఏసీ అమరావతి అధ్వర్యంలో చేపట్టిన ఉద్యమం 65 రోజులకు చేరుకున్నప్పటికీ ప్రభుత్వం కనీసం ఆర్థికపరమైన అంశాలను కూడా పూర్తిస్థాయిలో పరిష్కరించలేదన్నారు. నాలుగు డీఏ అరియర్స్ కు సంబంధించి సుమారు మూడు వేల కోట్లు జీపీఎఫ్ ఖాతాలకు వేయడం, సుమారు రూ.1800 కోట్లు సీపీఎస్, పెన్షనర్లకు నగదు రూపంలో చెల్లించడం, వేల కోట్ల పీఆర్సీ బకాయిలు (ఇంకా లెక్క తేలాల్సి ఉంది) చెల్లింపులు, 11వ పీఆర్సీ సిఫార్సు చేసిన పే స్కేల్స్ ఆమోదం తదితర అంశాలపై ఎలాంటి స్పష్టమైన ఆదేశాలు జారీ కాలేదన్నారు. ఇంకా ఇలాగే మా ఉద్యమాన్ని ప్రభుత్వం చిన్నచూపు చూస్తే ఉద్యమం ఉధృతం చేయక తప్పదని బొప్పరాజు, పలిశెట్టి హెచ్చరించారు.

ఉత్తమ పాలసీలు

విజన్‌తో అగ్రదేశంగా భారత్

- సాంకేతికత, జనాభా, యువశక్తి మనకున్న అనుకూలతలు
- అవకాశాలు కల్పిస్తే యువత అద్భుతాలు సృష్టిస్తారు: చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఉత్తమ పాలసీలు, విజన్ ద్వారా 2047నాటికి భారత్ ప్రపంచంలోనే అగ్రదేశంగా ఉండే అవకాశం ఉందని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చెప్పారు. క్రీస్తు పూర్వం భారత దేశం అతి పెద్ద, బలమైన ఆర్థిక వ్యవస్థగా ఉండేదని, ఇప్పుడు మరలా దేశం ప్రపంచంలో ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందన్నారు. ప్రణాళికతో పనిచేయడం ద్వారా 2047 నాటికి భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవిస్తుందన్నారు. మన దేశంలో ఉన్న యువత, సాంకేతికత, నిపుణులైన ప్రజల ద్వారా ఇది సాధ్యం అవుతుందని చెప్పారు. హైదరాబాద్‌లోని కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో ఆదివారం చంద్రబాబు పాల్గొని సుదీర్ఘ ప్రసంగం చేశారు. పబ్లిక్ పాలసీ అనేది చాలా శక్తివంతమైన ఆయుధమని, వ్యవస్థల్లో సమూల మార్పులు తేవడానికి పబ్లిక్ పాలసీలు చాలా ఉపయోగపడతాయన్నారు. గతంలో తాను విజన్ 2020 అంటే....420 అని హేళన చేశారు. కానీ గట్టినమ్మకంతో దానికే కట్టుబడి ఉన్నాను. భవిష్యత్ ఊహించి విమర్శలు భరించాను. ఇప్పుడు అదే విజన్ నిజం అయింది. మన కళ్ల ముందే ఫలితాలుకనిపిస్తున్నాయన్నారు. మరో 25 ఏళ్లలో దేశం 100 ఏళ్ల స్వాతంత్ర్య దేశంగా అవతరిస్తుంది. గత ఏడాది 75 ఏళ్ల స్వాతంత్ర్య సంబరాలు చేసుకున్నాం. 2047 సంవత్సరం టార్గెట్‌గా దేశం ఒక విజన్ సిద్ధం చేసుకోవాల్సి ఉంది. తద్వారా దేశం మంచి ఫలితాలు సాధిస్తుందన్నారు. మనం సంస్కరణల ముందు...సంస్కరణల తరువాత దేశాన్ని చూడాలన్నారు. అనేక రంగాల్లో పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ ద్వారా మార్పులు వచ్చాయి. ఈ విధానంలో తీసుకువచ్చిన మొదటి ప్రాజెక్ట్ హైదరాబాద్ లో నిర్మించిన హైటెక్ సిటీ. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా హైదరాబాద్‌లో ఇంత వ్యవస్థలను సృష్టించాం అంటే దానికి కారణం పీపీపీ విధానం అన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం కూడా అలాంటిదేనన్నారు.

బలమైన శక్తిగా ఆవిర్భవించే అంశంలో భారత్ కు అనేక అనుకూల అంశాలు ఉన్నాయి. ఇండియాకు ప్రధానంగా మూడు అనుకూలతలు ఉన్నాయి. ఒకటి టెక్నాలజీ. రెండోది మనకు ఉన్న యువ శక్తి. మూడోది పాపులేషన్ మేనేజ్‌మెంట్. ఈ అనుకూలతల ద్వారా 2047 నాటికి కార్పొరేట్ అండ్ పబ్లిక్ గవర్నెన్స్‌లో ప్రపంచంలో అన్ని చోట్ల ఇండియన్స్ అగ్రస్థానంలో నిలుస్తారని తెలిపారు. ఒకప్పుడు మనల్ని బ్రిటీష్ వాళ్లు పాలించారు.....ఇప్పుడు ఆ దేశానికి ప్రధానిగా భారతీయుడు ఉన్నారని తెలిపారు. రానున్న రోజుల్లో రూ.500, రూ 2000 రూపాయల నోట్లు రద్దు చేయాలి. దీని ద్వారా రాజకీయ అవినీతిని నివారించవచ్చు. ఆర్థిక వనరులు లేకున్నా మంచి పాలసీలతో అద్భుతాలు సృష్టించవచ్చునన్నారు. దేశంలో ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు ఇప్పటికీ తీవ్రమైన సమస్యగా ఉంది. కుటుంబం ఒక యూనిట్ గా మనం పాలసీలు తీసుకురావాల్సి ఉంటుంది. తద్వారా ప్రతి కుటుంబం లబ్ధి పొందుతుందన్నారు. ఇవన్నీ జరగాలి అంటే విజన్ తో పాటుమంచి నాయకత్వం కూడా ఉండాలన్నారు. ఇక్కడ చదువుకున్న మీరంతా సమాజంలో మంచి పాలసీలు తీసుకువచ్చి....సమాజంలో మార్పులు తీసుకురావాలని, కౌటిల్య అనే పేరు పెట్టుకున్న సంస్థలో చదివిన మీరు...ఆ పేరు నిలబెట్టాలని కోరారు. అనంతరం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ మొదటి బ్యాచ్‌కు చెందిన 43 మంది పట్టభద్రులకు పట్టాలు పంపిణీ చేశారు.

వాగ్దానాలను విస్మరించిన బీజేపీ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈశ్వరయ్య

విశాలాంధ్ర-కడప రూరల్: కర్నాటక రాష్ట్రంలో కులం, మతం, దేవుని పేరుతో, దేశభక్తి పేరుతో ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టి తద్వారా రాజకీయ లబ్ది పొందాలని చూసిన బీజేపీకి తగిన బుద్ధి చెప్పి లౌకికవాదాన్ని గెలిపించిన రాష్ట్ర ప్రజల ఆలోచన అభినందనీయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ ఎన్నికల వాగ్దానాలకు తిలోదకా లిచ్చి, ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతూ, వ్యతిరేకించే వారిపై స్వతంత్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ లబ్ధికి వాడుకుంటోందని తెలిపారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో సంపద సృష్టిలో భాగస్వామ్యం అవుతున్న శ్రమజీవులను ఆదుకునేందుకు మోదీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేక పోయిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు, జీఎస్టీ, పెద్దనోట్ల రద్దు వల్ల సామాన్య, పేద, మధ్యతరగతి వర్గం జీవనం అతలాకుతలమైందన్నారు. దేశంలో లౌకిక ప్రజాస్వామ్యం, సమైక్యత, సమగ్రత కోసం బీజేపీయేతర శక్తులన్నీ ఏకం కావాలని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సహాయ కార్యదర్శి పి.మహేశ్, కార్యవర్గ సభ్యులు ఎంవీ సుబ్బారెడ్డి, కేసీబాదుల్లా, శివరామకృష్ణ దేవర, ఏఐఎస్ఎఫ్ నాయకుడు వలరాజు, ఏఐవైఎఫ్ నాయకుడు మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఈత సరదాకు రెండు ప్రాణాలు బలి

విశాలాంధ్ర-పెనమలూరు: ఈత సరదా... ఇద్దరు యువకుల ప్రాణాల్ని బలి తీసుకుంది. ఈ ఘటన యనమలకుదురు కృష్ణా నది పాయలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం విజయవాడ పరిసర ప్రాంతాలకు చెందిన ఏడుగురు యువకులు యనమల కుదురు కృష్ణానది పాయలోకి వెళ్లి సరదాగా గడిపారు. అందులో ఇద్దరు తాడేపల్లి పరిధిలోని పాతూరు గ్రామం శివలింగాల గుట్ట దగ్గర కృష్ణానదిలోకి దిగి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు మునిగిపోయారు. గల్లంతైన యువకులను ప్రతివాడ బాలాజీ, పెసర్లంక సాయి తేజ గా గుర్తించిన పోలీసులు మృతదేహాలను మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

వచ్చే విద్యా సంవత్సరంలో

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి

పాఠశాల విద్యాశాఖ పీఎస్ ప్రవీణ్ ప్రకాశ్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వచ్చే విద్యా సంవత్సరంలో సకాలంలో సిలబస్‌ను పూర్తి చేసి మరింత ఉత్తీర్ణత శాతం పెంచే దిశగా కృషి చేయాలని పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ ఉపాధ్యాయులను ఆదేశించారు. స్కూల్ అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నెల్లూరు జిల్లా కావలి పర్యటనకు వెళ్లినప్పుడు 5వ తరగతి విద్యార్థిని వర్క్ బుక్‌ను పరిశీలించి వివరణ కోరగా సిలబస్‌లో సగం బోధించలేదని తెలిసిందన్నారు. ప్రతి విద్యా సంవత్సరంలో ఆగస్టు 15 నుంచి జనవరి 15 వరకు ఉండే కాలం విద్యార్థులకు చాలా కీలకమన్నారు. మార్గదర్శకాలను అనుసరించి ప్రతి వారంలో నిర్దేశించిన సిలబస్‌ను త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా ఉపాధ్యాయులకు సూచించారు. సకాలంలో సిలబస్ పూర్తికాకపోతే పరీక్ష సమయంలో విద్యార్థులకు భారంగా మారుతుందన్నారు. ఉపాధ్యాయులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించి సకాలంలో సిలబస్‌ను పూర్తి చేసేలా దృష్టి పెట్టాలని తెలిపారు. తద్వారా వారిని ప్రోత్సహించినట్లవుతుందని, అలాగే సకాలంలో సిలబస్ పూర్తి చేయడం ద్వారా విద్యార్థుల పునశ్చరణకు అవకాశం ఉంటుందన్నారు. దీంతో సహజంగానే వారు పాఠ్యాంశాలపై పట్టు సాధించి మంచి ఫలితాలు సాధించేందుకు ఉపయోగపడుతుందని ప్రవీణ్ ప్రకాశ్ పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న నాదెండ్ల మనోహర్

వైసీపీ విముక్త ఏపీ కోసం పని చేస్తాం

జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్

విశాలాంధ్ర-ఒంగోలు: రాష్ట్రంలో జరుగుతున్న దాష్టీకాలను దృష్టిలో ఉంచుకుని వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం పని చేస్తామని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. ఇటీవల మృతి చెందిన పార్టీ క్రియాశీలక సభ్యుల కుటుంబాలకు జనసేన తరపున రూ.5 లక్షల వంతున ఆర్థిక సాయం అందించేందుకు నాదెండ్ల మనోహర్ ఆదివారం ప్రకాశం జిల్లా ఒంగోలుకు విచ్చేశారు. శింగరాయ కొండ మండలానికి చెందిన ఆవుల వెంకట ప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించి రూ.5 లక్షల చెక్కును అందజేశారు. వెంకట ప్రసాద్ పిల్లల చదువుల బాధ్యత జనసేన తీసుకుంటుందన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మనోహర్ మాట్లాడుతూ హెలికాప్టర్‌లో తప్ప రోడ్డు మీద తిరగలేని ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని ఏ విధంగా ముందుకు తీసుకు వెళతారని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం పంచాయతీరాజ్ నిధులను మళ్లించి దివాళా తీయించిందన్నారు. సొంత డబ్బు ఖర్చు చేసిన అధికార పార్టీ సర్పంచ్ ధనలక్ష్మి ఆర్థిక ఒత్తిళ్లతో ఆత్మహత్య చేసుకుందంటే ఇదా మీ పరిపాలన? అని ప్రశ్నించారు. ప్రభుత్వ అసమర్థత తారస్థాయికి చేరిందన్నారు. అకాల వర్షాలకు నాలుగున్నర లక్షల ఎకరాల పంట నష్టపోతే ప్రతి గింజా కొంటా మన్న ముఖ్యమంత్రి ఎక్కడ ఉన్నారో తెలియడం లేదన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేటు కొట్టుకుపోతే ఇప్పటి వరకు నిర్మించలేని ప్రభుత్వం ప్రకాశం జిల్లాను అంధకారంలోకి నెట్టేసిందని తెలిపారు. కోస్తా జిల్లాల ఇన్‌ఛార్జ్‌గా ఉన్న వైవీ సుబ్బారెడ్డి వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలంటూ మళ్లీ పాదయాత్ర చేయాలని అన్నారు. జనసేన పార్టీ అవకాశవాద, స్వార్థ రాజకీయాలకు దూరంగా ఉంటుందని తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 73 మంది కౌలు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, పవన్ కళ్యాణ్ వారి కుటుంబాలకు లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించారని అన్నారు. వ్యవసాయ మంత్రి రైతులను ఆదుకునేందుకు తన జేబు నుంచి వెయ్యి రూపాయలు ఖర్చు చేశారా? అని ధ్వజమెత్తారు. డీఎస్పీల బదిలీలు... ఫ్లెక్సీల గురించి ఆలోచన చేయడమే వైసీపీ పరిపాలన అన్నారు. వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పారదర్శకంగా, ప్రజల ముందు చర్చించి రాష్ట్రానికి మేలు జరిగే విధంగా పొత్తులు ఉంటాయన్నారు. ఇప్పటికే పవన్ కళ్యాణ్ బీజేపీ అగ్రనాయకత్వంతో పాటు చంద్రబాబు నాయుడుతో చర్చించారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయ్ కుమార్, అధికార ప్రతినిధులు డాక్టర్ పాకనాటి గౌతమ్, రాయపాటి అరుణ, కార్యక్రమాల నిర్వహణ విభాగం కన్వీనర్ కళ్యాణం శివశ్రీనివాస్, పార్టీ నేతలు ఈదర హరిబాబు, మలగా రమేష్, ఇమ్మడి కాశీనాథ్, బెల్లంకొండ సాయిబాబు, పులి మల్లికార్జున్, బొందెల శ్రీదేవి, కందుకూరి బాబు, చిట్టెం ప్రసాద్, లీగల్ సెల్ నాయకులు సుంకర సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య విప్లవాన్ని సాధిద్దాం

- సమాజ రక్షణలో కీలక పాత్ర పోషిద్దాం
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర-లేపాక్షి: ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా, నైతికంగా సమసమానత్వం ఏర్పాటు చేసి ప్రజాస్వామ్య విప్లవాన్ని సాదిద్దామని సీపీఐ రాష్ట్ర సహాయక కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి పిలుపు నిచ్చారు. ఆదివారం సత్యసాయి జిల్లా లేపాక్షిలోని ఆర్‌జేహెచ్ ఫంక్షన్ హాలులో సీపీఐ అధ్వర్యంలో రాజకీయ శిక్షణా తరగతులు రెండవ రోజు నిర్వహించారు. ప్రజానాట్య మండలి కళాకారుల విప్లవ గీతాలతో ప్రారంభమైన శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరయిన సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించుకోవాలని అన్నారు. ఎన్నో విప్లవ సంఘాలు, మేధావులు, ఉద్యమ కారులు, మహిళా సాధికారిత సంఘాలు సమాజ సంస్కృతిని కాపాడే అందరిని ప్రోత్సహించుకుని, అందరిలో ఒకటిగా సీపీఐ ఉంటుందని అన్నారు. ఈ శిక్షణా తరగతులు పార్టీ కార్యకర్తల్లో మేధోశక్తిని పెంచి, పార్టీ బలోపేతం కావడానికి దోహద పడతాయని అకాంక్షించారు. ఐజేయూ జాతీయ కార్యదర్శి సోమసుందర్ మాట్లాడుతూ వ్యక్తిగత జీవితం నుంచి సమాజ నడవడికల వరకు సంస్కృతీ సంప్రదాయాలను అలవరుచుకుని సిద్ధాంత నిబంధనలకు కట్టుబడి సమానత్వంతో వ్యవహరించాలని అన్నారు. పేదలకు మానవతా దక్పథంతో సహాయ సహకారాలు అందించినపుడు మనిషి సాంప్రదాయం బయటపడుతుందని అన్నారు. ఎస్టీయూ నాయకులు రమేష్ మాట్లాడుతూ మేధోశక్తితో పని చేయాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ మాట్లాడుతూ ఎంతో మంది మేధావులు, కళాకారులు, పార్టీ సిద్ధాంతకారులు వారి అనుభవాన్ని దారిపోసి గంటల కొద్ది విలువైన సమాచారాన్ని అందజేస్తున్న ఈ రాజకీయ శిక్షణ తరగతులు భవిష్యత్ రాజకీయాలకు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు.

పోరాటాలతోనే రజకుల సమస్యలకు పరిష్కారం

విశాలాంధ్ర-అనంతపురం: రజక వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశీల పోరాటాలను నిర్వహించేందుకు అనంతపురంలో జరిగే ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు పిలుపునిచ్చారు. సదస్సు నిర్వహణపై ఆదివారం అనంతపురంలో జరిగిన సన్నాహక సమావేశానికి చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు, రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర నాయకులు సి.లింగమయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామాంజనేయులు మాట్లాడుతూ... సమాజంలో పని విభజన జరిగిన నాటి నుంచి ఎంతో నైపుణ్యంతో రజక వృత్తిని కొనసాగిస్తూ సమాజానికి సేవలందిస్తున్న రజక వృత్తిదారులే సామాజిక వివక్షకు గురవుతున్నారని, దాడులను, అవమానాలను గ్రామ బహిష్కరణలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ వృత్తిని కొనసాగిస్తున్నప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రజక వృత్తిదారుల సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. కేవలం రజక వృత్తిదారులను ఓటర్లుగా చూసే పాలకుల విధానాలపై సమరశీల పోరాటాలు చేయాలన్నారు. రజక వృత్తిదారుల సామాజిక భద్రత లక్ష్యంగా సమరశీల పోరాటాలు ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచేందుకు అనంతపురంలో జరిగే రజక వృత్తిదారుల రాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ అనంతపురం జిల్లా కార్యదర్శి సి.జాఫర్ మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతి వృత్తిదారుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. రజక వృత్తిదారులకు రాజ్యాంగంలో కల్పించిన హక్కులను కాపాడుకునేందుకు రజక వృత్తిదారుల స్ఫూర్తి ప్రదాతలైన సంత్ గాడ్గే బాబా, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ గార్ల స్ఫూర్తితో రజక వృత్తిదారుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని,ఈ పోరాటాలకు సీపీఐ సంపూర్ణ తోడ్పాటు నిస్తుందని తెలిపారు. చేతి వృత్తిదారుల సమాఖ్య అధ్యక్షులు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకా చలపతి మాట్లాడుతూ... సామాజిక నాగరికత నేర్పిన చేనేతలు, సమాజాన్ని శుభ్రంగా ఉంచే రజకులు లేనిదే సమాజ గమనమే లేదన్నారు. రజకుల సమస్యల పరిష్కారం పోరాటాల ద్వారానే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో గొర్రెల, మేకల పెంపకం దార్ల సంఘం రాష్ట్ర కన్వీనర్ కోట్ల పోతులయ్య, చేతి వృత్తిదారుల సమాఖ్య కర్నూలు జిల్లా కార్యదర్శి ఎం.కారన్న, నంద్యాల జిల్లా కార్యదర్శి ఎం.రామ్మోహన్, అనంతపురం జిల్లా రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా కార్యదర్శి సీవీ హరికృష్ణ, రజక చేతి వృత్తిదారుల సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు నాగప్ప, జిల్లా నాయకులు ఆదినారాయణ భూషణ, అక్కులప్ప, అయ్యప్ప, నాగరాజు, రంగయ్య, రామప్ప వీరాంజనేయులు,పెద్ద హుస్సేన్ అప్ప, బనకచర్ల బాలయ్య, సంజీవులు పాల్గొన్నారు.

విజయవంతంగా జర్నలిస్టుల ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖల సౌజన్యంతో విజయవాడలోని ఆంధ్రా లయోలా ఇంజినీరింగ్ కళాశాలలో జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల కోసం మే 13, 14 తేదీల్లో నిర్వహించిన ఈ శిబిరంలో 1,200 మంది జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని అవసరమైన వైద్య సేవలు పొందారన్నారు. తొలిరోజు వైద్య పరీక్షలకు, రెండో రోజు వైద్యులతో కన్సల్టేషన్‌కు 22 ప్రముఖ ఆస్పత్రులకు చెందిన అనుభవజ్ఞులైన వైద్య బృందంసేవలు అందించింది. ముందుగానే ఆరోగ్య సమస్యలను గుర్తించి పరిష్కరించుకోవడం ద్వారా జర్నలిస్టులు మరింత మెరుగైన జీవితాన్ని కొనసాగించాలన్నదే తమ తపన అన్నారు. కుటుంబ సమస్యలు పక్కనబెట్టి, ఆరోగ్య సమస్యలు పణంగా పెట్టి సమాజహితం కోసం పని చేసే జర్నలిస్టుల ఆరోగ్యాలు బాగుండాలని ఆకాంక్షించారు. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరి ఎం.టి.కృష్ణబాబు రెండో రోజు కూడా వైద్య ఆరోగ్య శిబిరాన్ని సందర్శించి వైద్యులు అందిస్తున్న సేవలను స్వయంగా పరిశీలించారు. జర్నలిస్టుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకున్న జర్నలిస్టులు ఈ సందర్భంగా కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయా ఆస్పత్రుల యాజమాన్యానికి డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో హరీంద్ర ప్రసాద్ చేతుల మీదుగా మెమెంటోలు అందజేశారు.

జగన్ సైకో చర్యలను ప్రజాక్షేత్రంలో ఎండగడతాం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పరిపాలన పరంగా ఘోరవైఫల్యం చెందిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల దృష్టిని మరల్చేందుకు అనుసరిస్తున్న సైకో చర్యలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు హెచ్చరించారు. చంద్రబాబు నివాసగృహాన్ని అటాచ్ చేయడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లేని, వేయని ఇన్నర్ రింగ్ రోడ్డుకు మార్పు చేసి అక్రమాలకు పాల్పడ్డారంటూ సైకో ప్రభుత్వం దుష్ప్రచారానికి పాల్పడుతోందన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఘోర వైఫల్యం చెందడం నుంచి, వివేకా హత్య కేసులో అవినాశ్ అరెస్టు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే చంద్రబాబుపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. అద్దె ఇంటిని అటాచ్‌మెంట్ చేయడం వైసీపీ సైకో చర్యలకు నిదర్శనంఞ ఉండవల్లి నివాసం ప్రభుత్వ భూమిలో ఉందని ఒకసారి, అక్రమకట్టడమని మరోసారి... ఇప్పుడు క్విడ్ ప్రోకో అంటూ విష ప్రచారానికి పాల్పడుతున్నారన్నారన్నారు. 'మీ బెదిరింపులకు భయపడేది లేదు... మావికాని ఆస్తులను మావని ఏవిధంగా చెబుతారు? మీ పాలనా వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఇదొక ఎత్తుగడ...జగన్‌మోహన్ రెడ్డి దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాలకు, అరాచకాలకు ఉపయోగించుకుంటున్నారు... విధ్వంసం, విద్వేషాలతో రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేస్తున్నారు. రాజకీయ కక్ష సాధింపులపై జగన్ రెడ్డి చూపుతున్న శ్రద్ధ ప్రజల ప్రాణాలు కాపాడటానికి చూపడంలేదు. జగన్ రెడ్డి సైకో పాలనకు, నిరంకుశ ధోరణికి ఘోరీ కట్టే రోజులు త్వరలోనే వస్తాయి' అని అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వం రాజకీయ ప్రత్యర్థులపై ఏసీబీ, సీఐడీలను ఉసి గొల్పుతూ... కేసులు బనాయిస్తోందని, ప్రతీకార రాజకీయం పై చూపిస్తున్న పట్టుదల రాష్ట్రాభివృద్ధిపై, ప్రజా ప్రయోజనాలు నెరవేర్చడంపై చూపాలని అచ్చెన్నాయుడు హితవు పలికారు.

ఏయూకి జాతీయ స్థాయిలో 9వ ర్యాంక్

విశాలాంధ్ర- విశాఖ సిటీ: ఆంధ్రవిశ్వవిద్యాలయాని (ఏయూ)కి జాతీయ స్థాయిలో 9వ ర్యాంక్ లభించింది. ది వీక్ హంస రీసెర్చ్ సర్వే 2023 భారత దేశ అత్యుత్తమ విశ్వవిద్యాలయాల జాబితాను విడుదల చేసింది. దీనిలో అఖిలభారతస్థాయిలో మల్టీ డిసిప్లీనరీ విశ్వవిద్యాలయాల విభాగంలో ఏయూ 9వ స్థానంలో నిలిచింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి టాప్ 10లో కేవలం రెండు విశ్వవిద్యాలయాలు మాత్రమే ఉన్నాయి. ఏయూ 521 స్కోరు సాధించింది. కాగా ఎడ్యుకేషన్ వరల్డ్ సంస్థ 2023-24 విద్యాసంవత్సరానికి భారత దేశంలోని ప్రభుత్వ మల్టీ డిసిప్లీనరీ విశ్వవిద్యాలయాలపై జరిపిన సర్వేలో ఏయూజ... ఆంధ్ర ప్రదేశ్‌లో మొదటి స్థానంలో, అఖిల భారత స్థాయిలో 29వ స్థానంలో నిలిచింది.

నేడు 'ఫాక్స్‌కాన్' భూమిపూజ

రూ.1656 కోట్ల పెట్టుబడితో కంపెనీ ఏర్పాటు

హైదరాబాద్: తైవాన్‌కు చెందిన ఐఫోన్‌లు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీ సంస్థ ఫాక్స్‌కాన్ తెలంగాణ రాష్ట్రంలో కంపెనీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ఫాక్స్‌కాన్ ప్రతినిధులతో కలిసి కంపెనీ నిర్మాణానికి సోమవారం ఉదయం పదిన్నర గంటలకు భూమిపూజ చేయనున్నారు. రూ.1,656 కోట్ల పెట్టుబడితో రంగారెడ్డి జిల్లాలోని కొంగరకలాన్ గ్రామంలో ఫాక్స్‌కాన్ కంపెనీ నిర్మాణం చేపడుతున్నారు. టీఎస్‌ఐఐసీ ఆధ్వర్యంలో దీనికి సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఈ కంపెనీ నిర్మాణం పూర్తయితే సుమారు 35 వేల మందికిపైగా స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆ సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. తెలంగాణలో కంపెనీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిన వెంటనే ఫాక్స్‌కాన్ సంస్థ అందుకు అంగీకరించింది. దాంతో రాష్ట్ర సర్కారు కంపెనీ ఏర్పాటు కోసం ఫాక్స్‌కాన్ సంస్థకు 196 ఎకరాల భూమిని కేటాయించింది. కాగా కంపెనీ భూమిపూజకు మంత్రి కేటీఆర్ హాజరవుతుండటంతో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ఆదివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పరిశీలించారు. కలెక్టర్ కార్యాలయంలో ఫాక్స్‌కాన్ సంస్థ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. రేపటి భూమిపూజకు సంబంధించిన విషయాలపై వారితో చర్చించారు.

సాహితి

అస్తిత్వ వేదనే కవిత్వమైతే...

తన విశాల నేత్రాలతో వసుధైక జీవన సౌందర్యాన్ని దర్శించాలనుకుంటుంది కవిత్వం. అందుకోసం మానవ జీవన పార్శ్వాలను ఆత్మీయతాసుగంధంతో నింపుతూవుంటుంది. మనిషి మనిషికీ మధ్య అనుబంధపు ప్రవాహమైపోవాలని తహతహలాడి పోతుంటుంది. మనిషి హక్కుల్ని కాలరాసే సామాజిక అసమానతల్నించీ, కొండంతగా పాకిపోతున్న వివక్షల్నించీ పెల్లుబికే అస్తిత్వ వేదనను చూసి కవిత్వమూ చలించిపోయింది. ఆ అసమానతల్నీ, ఆ వివక్షల్నీ కూకటివేళ్లతో పెకళించడానికి అది కొండంత సామాజిక బాధ్యతను భుజానెత్తుకొని ఒక ఆయుధమై పోయింది. అస్తిత్వ పోరాటమైపోయింది. పూలపరిమళాల్ని గుప్పిట పట్టుకోవడానికి ప్రయత్నిస్తూ సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక దోపిడీలకు పాల్పడుతూ పితృస్వామ్య వ్యవస్థ నిర్మించిన మహిళల మౌనవేదనల కోటలపై విర్రవీగే పురుషాహంకారపు పతాకాలను కూలద్రోయడానికి, బహుజనుల ఆత్మగౌరవపు తోటల్లోకి చొరబడిన కులాధిపత్యపు శిశిరాలను కాలరాయడానికి కవిత్వం తన అక్షరాలనిండా చైతన్యప్రవాహాన్ని వొంపుకుంటూనే వుంది. నిరంతర అస్తిత్వ అన్వేషణలో అది ఒక అనివార్య యుద్ధగీతమైపోయింది. బిగుసుకున్న పిడికిలి అయిపోయింది. ఆకాశమంత స్వేచ్ఛ కోసం, వెన్నెలంత ఆత్మగౌరవం కోసం అది తపిస్తూనేవుంది.

'మొగ్గలు పువ్వులవకుండా కిటకిట్లాడే క్రిముల నిఘా
చుక్కలు పదునెక్కకుండా మబ్బు మబ్బు రాజుకున్న పొగ
రెక్కలు ఎగరనీకుండా క్షతపవనాలు చుట్టిన పగ
వీళ్లు కదా మన మిత్రులు, పుత్రులు, తండ్రులు
తీరని శాపాలు, తలకొరివి దీపాలు అని పాడుకుంటూ
పహారాలతో, పరదాలతో జీవితం మీద పేరుకుంటున్న
చావునీటిమట్టాన్ని తోడి పారబోసుకోవడం పూర్తికానేలేదు'
('స్లీపింగ్ పార్టనర్' ఖండిక నుంచి)

అంటూ స్త్రీ అస్తిత్వాన్ని తన పదఘట్టనలతో అణచివేసే



పితృస్వామ్యవ్యవస్థ మీద ధ్వజమెత్తింది కొండేపూడి నిర్మల కలం. పూల సరాగాలు కాకముందే మొగ్గల నిండా విరాగాల్ని నింపే సామాజిక కీటకాల నిఘాపై నిఘాపెట్టింది కవిత్వం. నిండుగా కాంతులు చిమ్మకముందే నారీనక్షత్రాలను కప్పేసిన పురుషాహంకారపు మబ్బుల పొగకు పొగ పెట్టాలని యత్నిస్తోంది. రెక్కలస్వేచ్ఛకు అడ్డుపడే ప్రచండ పవనాల పగను పసిగడుతోంది. ప్రియతములనే వాళ్లతో గడిపే క్షణాలన్నీ తీరని శాపాలైపోతుంటే, వారంతా తమపాలిట కొరివి దీపాలైపోతుంటే ఆ మహిళ వేదనంతా తానే అయిపోయింది కవిత్వం. ఆమె పాలిట పహారాలుగా, పరదాలుగా పెత్తనం చెలాయిస్తున్న పురుషాధిపత్యపు శృఖలాల్ని ఛేధించడానికి చైతన్యప్రవాహమై పోయింది. సన్నని నీటిపాయలు సెలయేళ్లైపోవాలని, సెలయేళ్లు నదులైపోవాలని, నదులు సముద్రాలైపోవాలని, ఆ సముద్రాలు అస్తిత్వపు అలలతో ఎగిసిపడుతుండాలని అది తపిస్తోంది.

'నేనూ/ నా వేసబాసలు వెక్కిరింతలైనచోట
నా ఇల్లు ఊరవతల కాలనీగా మొలుస్తున్నపూట
నన్ను ఎక్కడికక్కడ వేరుచేస్తున్న చోట
జివ్వుమనే నొప్పితో నవ్వుల తోటనెలా అవుతాను
....
నా చెప్పులపై నడిచి/ నా డప్పులతో ఊరేగి
నా సప్పరంలో కొలువుదీరేదాకా/ నేను ఇలాగే ఇలాగే
నా నెత్తురుతో మాట్లాడుతుంటాను
నేనేందో తెల్సుకున్నాకా/ నాను నాలాగే
మాట్లాడుతుంటాను'
('నేను పలానా' ఖండిక నుంచి)

అంటూ బహుజన అస్తిత్వ వేదనను అక్షరీకరించింది వర్తమానకవి పల్లిపట్టు నాగరాజు కలం. తన ఉనికికి అడ్డుపడే కులాధిపత్యపు వెక్కిరింతల్ని ప్రశ్నించే బాధితుడికి కవిత్వం తోడైంది. మనిషి నుంచి, సామూహిక మనిషితనం నుంచి తనను వేరుచేసేసామాజిక బాధ అతడిది. ఆధిపత్యం తన ఆత్మగౌరవానికి తూట్లు పొడిచేబాధ అతడిది. అతడి వేదనతో కవిత్వం మమేకమైపోయింది. పనిగట్టుకొని అతడిని 'పలానా' చేసేస్తున్న సామాజికశక్తులపై యుద్ధం ప్రకటించాలని, అతడు తల ఎత్తుకొనే నవ్వులతోట కావాలని, ఆత్మీయతా పరిమళాల మధ్య అతడు తొక్కుడుబిల్లాట ఆడాలని, అతడిని బాధిస్తున్న తరతరాల జివ్వుమనే నొప్పి రివ్వుమని ఎగిరిపోవాలని అది తపిస్తోంది. ఆత్మవిశ్వాసపు డప్పులతో ఊరేగి సంకల్పపు కొలువుదీరేదాకా కుతకుతలాడే నెత్తుటితో మాట్లాడే అతడి అనంతమైన బాధతో జతకట్టి ఓదార్పునిస్తుంది కవిత్వం. మనిషి విభిన్న జీవన పార్శ్వాలలోకి తొంగిసూస్తూ అతడిలో సంలీనమైపోతూ వుంటుంది. అందుకే అది నిరంతరం ఆరళ్ల కాసారంలో మగ్గిపోయే గానుగెద్దు జీవితం లాంటి అమ్మ దుఃఖమైపోతుంది. బానిసత్వపు కొలిమిలో ఇనుప దిమ్మెలా రగిలిపోయే అయ్య వేదనైపోతుంది. కవిత్వం తనలోని సహస్ర ముఖాలను అస్తిత్వ పతాకాలుగా ఎగరేస్తుంటుంది.

-డాక్టర్ కొత్వాలు అమరేంద్ర, సెల్: 9177732414

21న గ్రంథాలయ సందర్శనయాత్రకు ఆహ్వానం

గ్రంథాలయాలు మన జాతి విజ్ఞాన సంపదలు. వాటిని గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి విధిగా భావించిన 'ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం' ప్రప్రథమంగా 100 ఏళ్ళు పూర్తి చేసుకున్న ప్రకాశం జిల్లా వేటపాలెంలోని 'సారస్వతినికేతనమ్' గ్రంథాలయ సందర్శన యాత్రతో ఈ యాత్రను ప్రారంభించింది.. అందులో భాగంగా ఈ ఏడు వేలాది పుస్తక సంపదను కలిగివున్న గుంటూరులోని 'అన్నమయ్య గ్రంథాలయ సందర్శన యాత్ర'కు శ్రీకారం చుట్టింది. ఈ నెల 21వ తేది ఉదయం తెలుగు రాష్ట్రాలలోని రచయితలు, కవులతో గ్రంథాలయ సందర్శన యాత్రను 'ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం' ఏర్పాటు చేస్తున్నది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఘనకీర్తిని చాటేవిధంగా 77 మంది కవులతో తీర్చిదిద్దిన 'మన ఆంధ్రప్రదేశ్' కవితా సంకలనాన్ని ప్రఖ్యాత కవి, విమర్శకులు డాఎ పాపినేని శివశంకర్ ఆవిష్కరిస్తారు. డా. ఉప్పలధడియం వెంకటేశ్వర హైకూ సంపుటి 'విత్తనం'ను ప్రముఖ కవి అడిగోపుల వెంకటరత్నం ఆవిష్కరిస్తారు. అన్నమయ్య గ్రంథాలయం వ్యవస్థాపకులు లంకా సూర్యనారాయణతోపాటు ఇంకా ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని పలువురు కవులు, రచయితలు పాల్గొంటారు. ఇతర రచయితల పుస్తకా విష్కరణలు కూడా ఇందులో ఉంటాయి. కనుక ఈ యాత్రను సందర్శించడానికి పాల్గొన దలచినవారు 9247475975 నెంబరుగల సెల్ నెంబరులో పేర్లు నమోదు చేసుకుంటే, విచ్చేసే ఔత్సాహికులకు ఉచిత భోజన ఏర్పాట్లు చేస్తుంది ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం. జాతి ఔన్నత్యాన్ని తెలియజేసే ఈ యాత్రకి అందరూ సహకరించవలసిందిగా 'ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం' ఈ సందర్భంగా కోరుతున్నది.

-సోమేపల్లి వెంకట సుబ్బయ్య, అధ్యక్షులు - చలపాక ప్రకాష్ , ప్రధాన కార్యదర్శి
ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం

డిసెంబ్రిష్టుల స్ఫూర్తిలో...

ప్రపంచ చరిత్రలోనే రెండున్నర రోజుల్లోనే విప్లవం విజయవంతం చేసుకున్న ఘనత బొల్షివిక్లది. కానీ రష్యా విప్లవం విజయవంతం కావడానికి ముందు వందేళ్ల చరిత్ర పేజీలను తిరగేస్తే తప్ప ఇది పూర్తిగా అర్థం కాదు.ఆ పుటల్లో బొల్షివిక్‌లకు ముందు నరొడ్నిక్‌లు కనపడతారు. వారికంటే ఇంకా ముందుకెళ్తే డిసెంబ్రిష్టులు కనపడతారు. వారి తిరుగుబాటు, వారు పడ్డ కష్టాలు, ఆ తిరుగుబాటుదారుల భార్యలు చేసిన సాహసోపేతమైన పాత్ర కనపడుతుంది. అలాంటి డిసెంబ్రిష్టుల గురించి సంపూర్ణంగా వివరించిన మొదటి తెలుగు ప్రయోగాత్మక నవల ఈ "డిసెంబ్రిష్టు ఖైదీ". ప్రజల కలను కనడమే విప్లవకారుల నేరం. ఆ నేరానికి జార్లు వేసే శిక్షలు భరించలేనంత బాధగా వుంటాయి. ఎట్లంటే రైతులు బానిసత్వం నుండి విముక్తి కావాలని సేర్గీ ఆశయంగా పెట్టుకున్నాడు.అందుకు తన పాత్రను క్రియాశీలకంగా పోషించాడు. ఒక గొప్ప తిరుగుబాటు వల్ల తనకు జైలు శిక్ష పడింది. అంతకుముందే సేర్గీ సైనిక జనరల్ కదా, ఆయనకు పడ్డ శిక్ష మామూలు శిక్ష అనుకుంటే పొరపాటే. ఆయన్ని రష్యాకు చాలా దూరంగా సైబీరియాలో పడేశారు. అప్పటికే ప్రభు వంశ రాకుమారి మరియతో తన పెళ్లి అయ్యి కొడుకు కూడా ఉన్నాడు. ఆ మరియ తన భర్త కోసం వెళ్తూ వేల టన్నుల దుఃఖంతో జ్ఞాపకాలను నెమరేసుకుంటుంది. ఈ వలపోతతోనే నవల మొదలౌతుంది.

మరియ పాడిన సొనటాల వింటూ సేర్గీ మైమరిచాడు. అట్లనే స్పష్టమైన విషయ అవగాహన కలిగిన సేర్గీనీ మరియ ప్రేమించింది.వారి ముచ్చట్లు ప్రధానంగా సాహిత్యం, కళలు, జార్ల నిరంకుశత్వాన్ని గురించి సాగేవి.సేర్గీ ఒక అడుగు ముందుకేసి జార్ల తీరు మారాలంటే ఏం చేయాలో చెప్పేవాడు.అది మరియకు ఆసక్తికరంగానూ,కొన్నిసార్లు భయంగానూ అనిపించేది. అందుకేనేమో భర్త అంటే ఇష్టాన్ని రెట్టింపుగా పెంచుకుంది. ఇంకా భర్త సెర్గీ గురించి చెప్తూ ...సైనిక జనరల్ గా వున్న సెర్గీ అతని మిత్రులు బోరోధిన్ యుద్ధం ముగిశాక కోసాక్కు రైతుల ఇండ్లల్లో బస చేశారు.అప్పుడే ఈ బానిస రైతులను ఆచరణను చూసి చైతన్యమయ్యారు.వారి పోరాటాల వల్లనే రష్యా నెపోలియన్ తో జరిగిన అనేక యుద్ధాల్లో గెలవగలిగిందనీ గుర్తు చేసుకున్నారు.కానీ నేటికీ ఈ రైతులు, పేదలు మాత్రం ఇంకా బానిసత్వంలో మగ్గుతుండడం చూసి చలించి తన మనస్సులో దృఢమైన ఆశయాన్ని ఏర్పరుచుకున్నారు.ఇంకా సైనికుల పట్ల కూడా చిన్నచూపు కలిగిన జార్ల ను వ్యతిరేకించడం పనిగా పెట్టుకున్నారు.

"దేశ ప్రేమికునికేం జరుగునో తేలుతుంది ఇకముందు/ ఎవరి దాడి ఫలించునో శత్రువులపై మునుముందు. నిరంకుశ పాలకుడే లక్ష్యం నా యందు"

అని ఓ కవి రాసిన కవిత ను మరియకు తన మార్పుకు కారణంగా వినిపిస్తాడు.సాహిత్యమంటే ఇద్దరికీ ఇష్టం.ఇంకా సాహిత్యం గురించి చెప్తూ "సాహిత్యం మన జీవితాల్ని విశాలంగా చేస్తుంది,కేవలం స్వార్థ బుద్ధితో జీవించే జనం ఆలోచనల్ని, సాహిత్యం విశాలంగా ఆలోచించడం నేర్పుతుంది" అని చెప్తాడు.

ఇంతటి విశాల దృక్పథం కల్గిన సెర్గీ ఏం చేశాడు. ఆయన ప్రభు వంశ మిత్రులను కలిశాడు,కొందరు రైతు సైనికులను కలిశాడు. వారితో బానిసత్వ రద్దుకు జరిగే తిరుగుబాటులో భాగమవ్వాలని నిర్మాణాలు చేసేవాడు.భిన్నాభిప్రాయాలు తలెత్తిన చోట తన వాగ్ధాటితో పరిష్కరించేవాడు. ఆ విధంగా రక్షణ సంఘం, సంక్షేమ సంఘం గానూ, అది మళ్ళీ ఉత్తరాధి సొసైటీ, దక్షిణాది సొసైటీలు గాను మారి చేసిన కృషిని వివరిస్తాడు.వారిలో తలెత్తిన రాజ్యాంగ రహిత రిపబ్లికనిజం,రాజ్యాంగ సహిత రిపబ్లికనిజం గురించి సిద్ధాంత చర్చ చేసి ఎక తాటిపైకి తేవడంలో,యుక్రెయిన్ లోని విప్లవ సంస్థలను వాటి ఐక్యత కోసం తను, పెస్తేల్ చేసిన కృషిని గురించి చెప్తాడు. నిర్మాణాత్మకంగా ఇంకా బలపడక ముందే,తమ తదుపరి కార్యాచరణపై అందరూ ఒక స్పష్టమైన అవగాహనతో రాకముందే అనుకోని సందర్భంలో ఒక తిరుగుబాటు చేశారు.ఇందులో నాయకత్వం వెనుకడుగు వేసింది.ఐనా తమకు జార్లు పట్ల వున్న వ్యతిరేకతతో కొందరు ముందుకెళ్ళి వీరత్వంతో పోరాడారు.మొట్ట మొదటి సారి గానీ కొద్ది క్షణాల్లో దేశం ప్రజల పరం కాబోతుందనుకునే దశలో కథ అడ్డం తిరిగింది.తిరుగుబాటు విఫలమైంది.జార్ నికోలస్ ఆ సైనికులందరిని సైబీరియా జైల్లో బంధించాడు.ఐదుగురికి అతి దారుణంగా ఉరి శిక్ష విధించాడు.పరిస్థితులు తారుమారయ్యాయి.కట్టు బట్టలతో సెర్గీ అరెస్ట్ అయ్యాడు. జీవిత ఖైదు పడింది.

ఈ వార్త తెలిసి మరియ తల్లడిల్లింది.తన భర్త ఇక తిరిగిరాడని మరో పెళ్లి చేసుకొమ్మని మరియ నాన్న, కుటుంబీకులు వేధించసాగారు.కానీ వాటిని ఎదురించి మరియ సెర్గీ కోసం బయలుదేరుతుంది.తన కష్టంలోను భాగమవుతానంటుంది. తనకోసం ఐదు వేల మైళ్ళ దూరం దాటి జైల్లో చావు బతుకుల్లో వున్న తన భర్తను చేరింది.మళ్ళీ నూతనంగా తనలో ప్రాణాన్ని నింపింది.బతకాలని ఆశను రగిల్చింది. అందుకే సెర్గీ తన ఆశయాన్ని గుర్తు చేసుకున్నాడు. అందుకు మరియనే కారణమని నిత్యం గుర్తు చేసుకున్నాడు. ఆమె వచ్చిన తర్వాత మరెందరో వారి భర్తల కోసం వచ్చారు. తమ అస్థిత్వము వదులుకొని భర్తల కోసం అక్కడికి వచ్చిన వారిని కూడగట్టి నాణ్యమైన ఆహారాన్ని అందించడంలో, సౌకర్యాలను కలిగించడంలో, బట్టలను అందించడంలో, అక్కడి నుండే మాస్కో, సెయింట్ పీటర్స్ బర్గ్‌లో వున్న తమ మిత్రులకు బంధువులకు ఉత్తరాలు రాసి డబ్బును సేకరించి వారి భర్తల అవసరాలను తీర్చేవారు. ఖైదీల హక్కులను కాపాడడం ప్రభుత్వాల బాధ్యత. కానీ అది పట్టించుకోకుండా వారికి ఎలాంటి సౌకర్యాలు ఇవ్వకుండానే ఇనుప గనుల తవ్వకం, వెండి గనుల తవ్వకంలో టార్గెట్లు పెట్టి మరి వేధించే వారు. ఆ సందర్భంలో ఈ డిసెంబ్రిష్టుల భార్యలు అందించిన సేవల వల్లనే వాళ్ళు ప్రాణాలతో బయట పడగలిగారు. ఇది భార్యలు చేసిన పోరాటం. చరిత్ర పేజీల్లో వీరి కృషి గొప్పది.

సెర్గీ మరో రూపం ఇంకా ఆశ్చర్యపరుస్తోంది. ప్రభు వంశ సైనిక జనరల్‌గా, ప్రేమికుడిగా, తిరుగుబాటుదారుడిగా, ఖైదీగా, చివరగా రైతుగా మారిన తీరును చూస్తాం. జైలు జీవితం తర్వాత మళ్ళీ ప్రవాస జీవితం గడపాలని జార్ వేసిన శిక్ష. అందుకు తను యురిక్ గ్రామంలో రైతుగా మారాడు. కూరగాయలను పండించడం, బంగాళాదుంపలు, దోస కాయలు, పుచ్చకాయలు, గోధుమ పంటలు పండించడమే కాదు. అధిక దిగుబడులను తెచ్చేలా విత్తనాలను తయారుచేశాడు. తన జీవితం చివరాఖరకి చేరుతుండగానే రష్యాలోనే కాదు యావత్ యూరోప్ అంతటా స్వేచ్ఛ, స్వాతంత్ర్య పోరాటాలు మొదలుపెట్టాయి. రష్యాలో కూడా ఆయా వర్గాల జాతుల ఆకాంక్షలతో ఉద్యమాలు పెల్లుబికాయి. వ్యవసాయ సోషలిజం అంటూ నరోద్నిక్‌లు వచ్చారు. జార్లను చంపడమే పనిగా పెట్టుకున్న వీరిలో నుండే "భూమి పంపిణీ జరగాలని, ఊహాజనిత సోషలిజం కాదు శాస్త్రీయ సోషలిజం వైపు నడవాలని అది మార్క్సిజంలో వుందని ప్లేహనొవ్ వచ్చాడు. తొలి మార్క్సిస్ట్‌గా పరిచయమై తన భావజాలాన్ని రష్యాలో వ్యాప్తి చేస్తూ నరోద్నిక్‌ల నుండి రెండో పాయను ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలో రష్యాలో వర్గాలు ఏర్పడుతాయి. రైతులు, కార్మికులు విప్లవ శక్తులుగా ఏర్పడుతాయి. ఇది గమనించిన లెనిన్ కార్మిక వర్గ విముక్త పోరాట సంఘం పెట్టి అనేక కార్మిక వర్గ పోరాటాలు నిర్వహిస్తాడు. ఇస్క్రా పత్రికతో ప్రజల,కార్మికుల ఆశయాలను బలంగా వినిపిస్తాడు.తన రచనలతో మార్క్సిజాన్ని విప్లవం దిశగా నడిపిస్తాడు. పెట్టుబడి దారీ వ్యవస్థ యొక్క అత్యున్నత దశ అయిన సామ్రాజ్యవాదాన్ని బోల్షివిజంతో ఓడించి రష్యాను విప్లవ పథంలో నడిపిస్తాడు. ఈ పోరాటం వెనుక డెసెంబ్రిష్టుల త్యాగం వున్నదని ఆ వీరుల పోరాటాలను స్మరించుకోవాలని లెనిన్ డిసెంబ్రిష్టుల గురించి మాట్లాడడం మనస్సును చైతన్యపరుస్తుంది.

ఈ నవలలో మరి కొన్ని వీరోచిత గాథలు,ఎన్నెన్నో మనస్సును మెలిపెట్టే సంఘటనలు, బంధాలు వున్నాయి. ఈ తరం కూడా రష్యా చరిత్రను సులభంగా అర్థం చేసుకునేలా వుంటుంది. ప్రజల్లోకి చేరిన ఏ ఉద్యమం ఐనా విజయం సాధించక తప్పదు. దానికోసం గత గుణపాఠాలు స్వీకరించడంలో, తగిన ఎత్తుగడలు నిర్మించడంలో నాయకత్వ పటిమ అవసరం. అందుకు సరైన అధ్యయనం అనివార్యం. ఇలాంటి రచనలు ప్రతి తరానికి అవసరం. ఆయా కాలాల్లో అవసరమైన చోట డిసెంబ్రిష్టుల స్ఫూర్తిని కొనసాగించవల్సిందే.

అమృతరాజ్, సెల్: 8897463990

చలం స్మారకోపన్యాస సభకు ఆహ్వానం

'జీవజలం చలం' చలం స్మారకోపన్యాస సభ 18-5-2023 గురువారం సాయంత్రం 5 గంటలకు రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జరుగుతుంది. చలం ఆత్మకథపై నగ్నముని ప్రసంగిస్తారు. చలం ఆత్మకథలోని కొన్ని భాగాలను శీలా సుభద్రాదేవి, కొండేపూడి నిర్మల, ఘంటశాల నిర్మల, సజయ, మామిడి హరికృష్ణలు చదువుతారు. ఈ సభలో అందరూ పాల్గొనాలని కోరుతున్నారు.

- నాళేశ్వరం శంకరం, కన్వీనర్, చలం భావన

చందు ట్రస్ట్ సాహిత్య పురస్కారం

ఆచార్య చందు సుబ్బారావు సాహిత్య పురస్కారం 2023 కు గాను ప్రముఖ సాహితీవేత్త డా॥డి.వి.సూర్యారావుకు అందిస్తారు. ఈ నెల 18 వ తేదీన సా॥6 గంటలకు ద్వారకానగర్‌లో విశాఖ పౌర గ్రంథాలయం పెద్ద హాలులో నిర్వహిస్తారు. ఈ సభకు మాజీ యు.పి.ఎస్.సి మెంబర్ ఆచార్య కె.ఎస్.చలం అధ్యక్షత వహిస్తారు. మాజీ మంత్రివర్యులు ప్రఖ్యాత నాటక రచయిత దాడి వీరభద్రరావు ముఖ్య అతిథిగా పాల్గొని పురస్కార గ్రహీతను సత్కరించి, జ్ఞాపికను, రూ.10,000/- లు చందు ట్రస్ట్ పురస్కారాన్ని అందిస్తారు. పురస్కార గ్రహీత గురించి డా॥పి.గోపాల్ నాయుడు సమగ్రంగా ప్రసంగిస్తారు. ఆచార్య వెలమల సిమ్మన్న, మేడా మస్తాన్‌రెడ్డి, మరుపిళ్ల పైడిరాజు, అడపా రామకృష్ణ ఈ సభలో పాల్గొంటారు. ఈ సభకు నగరంలోని రచయితలు, కళాకారులు, మేధావులు అందరూ విచ్చేసి సభను జయప్రదం చేయాలని కోరుతున్నారు.

-ఉప్పల అప్పలరాజు, కార్యదర్శి,
ఆచార్య చందు సుబ్బారావు లిటరరీ అండ్ కల్చరల్ ట్రస్ట్

మంచి పుస్తకం

అసమర్థతకు ఆనవాలు మోదీ

స్వయంగా ఆలోచించగలిగే వారు కూడా మోదీ ప్రభుత్వ సమర్థతా రాహిత్యాన్ని గుర్తించలేక హిందుత్వ రాగాలాపనకు పాల్పడుతున్న దశలో మోదీని నిలదీయడం సాహసమే. ఒక వేపు అకడమిక్ అర్హతలు, ఇంకోవేపు ఆర్థికశాస్త్రంలో సంపూర్ణ అవగాహన, మరో వేపు తల్లిదండ్రులు కూడా రాజకీయాలలో ఉండడం వీటన్నింటికీ తోడు స్వయంగా సామాజిక-రాజకీయ-ఆర్థిక పరిణామాల మీద క్షుణ్ణమైన అవగాహన ఉన్నందువల్లే పరకాల ప్రభాకర్ మోదీ అసమర్థతను "ది క్రుకెడ్ టింబర్ ఆఫ్ న్యూ ఇండియా: ఎస్సేస్ ఆన్ ఎ రిపబ్లిక్ ఇన్ క్రైసిస్" లో నిర్మొహమాటంగా బయట పెట్టగలిగారు. పరకాల తల్లి, తండ్రి కూడా రాజకీయాలలో ఉన్నవారే. తల్లి కాళికాంబ శాసనసభ్యురాలిగా ఉండేవారు. తండ్రి పరకాల శేషావతారం మూడు మంత్రివర్గాలలో పని చేశారు. అంతకు ముందు ఆయన కమ్యూనిస్టు పార్టీలో ఉండేవారు.

పరకాల గ్రంథం లాంఛన ప్రాయంగా ఆవిష్కరణ జరగకపోయినా ఆలోచనాపరులను ఆకర్షించింది. "ది వైర్" వెబ్ పోర్టల్ లో రచయితను కరణ్ థాపర్ ఈ గ్రంథంపై సుదీర్ఘంగా ఇంటర్వ్యూ చేశారు. ప్రేం ఫణిక్కర్ కూడా ఆయనను ఇంటర్వ్యూ చేశారు.

పరకాల ప్రభాకర్ కు రాజకీయ ఆర్థిక శాస్త్రంలో అభినివేశం ఉంది. రాజకీయ, సామాజిక వ్యాఖ్యాతగా ఆయన గురించి అనేకమందికి తెలుసు. ఈ టీవీలో "ప్రతిధ్వని" కార్యక్రమాన్ని పరకాల కొన్నేళ్ల పాటు నిర్వహించారు. ఏన్ టీవీలో "నమస్తే ఆంధ్రప్రదేశ్" పేర ఇలాంటి కార్యక్రమం కొనసాగించారు. ఒకప్పుడు ఆయన బీజేపీలో ఉన్నారు. కొంతకాలం ఆంధ్ర ప్రదేశ్ లో బీజేపీ అధికార ప్రతినిధిగా వ్యవహరించారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కొంతకాలం సమాచార వ్యవహారాల సలహాదారుగా కాబినెట్ హోదాలో ఉన్నారు. ప్రజా రాజ్యం పార్టీ ఏర్పడినప్పుడు ఆయన వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగానూ, అధికార ప్రతినిధి గానూ బాధ్యతలు నిర్వర్తించారు. "మిడ్ వీక్ మాటర్స్" అన్న ఆయన యూట్యూబ్ కార్యక్రమానికీ బహుళ జనాదరణ దక్కింది.

ఈ విస్తారమైన అనుభవమే ఆయన ఈ తాజా గ్రంథం వెలువరించడానికి కారణం కావొచ్చు. ఈ గ్రంథం ఆవిష్కరణ బెంగళూరులో ఆదివారం జరిగింది. ఈ గ్రంథంలో అనేక విషయాలను ఏ మాత్రం బెరుకు లేకుండా, మొహమాటాలకు, తెచ్చిపెట్టుకున్న మర్యాదలకు పోకుండా రాయడం ఒక రకంగా ఆశ్చర్యం కలిగిస్తుంది. మోదీ అధికారం చేపట్టిన తరవాత నెలకొన్న ప్రస్తుత వాతావరణమే ఈ ఆశ్చర్యానికి కారణం. అయితే ఈ గ్రంథాన్ని ప్రచురించాలా లేదా అని కొంత కాలం పరకాల సందిగ్ధంలో ఉన్నారట. చివరకు సాహసించారు. ఈ గ్రంథ ప్రచురణ నిజంగా సాహసమే. ఎక్కడైనా తప్పు జరిగినప్పుడు దాన్ని ఎత్తి చూపడం పరకాల నైజం. పరకాల రాజకీయాలను ఆమోదించినా, ఒప్పుకోక పోయినా ఆయన నిజాయితీని శంకించలేం. మోదీ హయాంలో ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం అయిపోయిందంటారు ప్రభాకర్. అక్కడితో ఆగకుండా మోదీ ప్రభుత్వానికి ఆర్థికాంశాలలో నిర్దిష్టమైన సిద్ధాంత ప్రాతిపదిక లేదని చెప్పారు. ఎక్కడైనా తప్పు జరుగుతోందని అనిపించినప్పుడు కిమ్మనకుండా ఉండలేని తత్వం ఆయనది. ఆర్థిక విషయాలలో మోదీ అసమర్థత కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని రుజువు చేయడానికి ఆయన అనేక గణాంకాలను మన ముందుంచారు. నిరుద్యోగం సగటున ఏడు శాతం ఉన్నా యువతలో అది 18 శాతం దాకా ఉండడం ఆందోళనకరం అంటారు ప్రభాకర్. మన జనాభాలో అత్యధికులు యువతే ఉన్నప్పుడు వారికి జీవనోపాధి లేకపోవడంతో పరిస్థితి



వికటిస్తుందన్నఆందోళన ఆయనను వేధిస్తోంది. సంపద సృష్టిలో దేశ పరిస్థితి ఆశాజనకంగానే ఉన్నప్పటికీ ఆ సంపద అతి కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతం కావడం, విస్తారమైన జనాభా పేదరికంలో కూరుకుపోవడం కల్లోలాన్ని సృష్టించే ప్రమాదం ఉందంటారు పరకాల.

మన గణతంత్రానికి పునాదులు వేసిన వారి కృషి, ఆ నాటి విలువలు మోదీ హయాంలో శీఘ్రంగా పతనం అవుతున్నాయన్నది ఆయన ఆవేదన. ఇదే వ్యథ చాలా మందికి ఉంది. దీనికంతటికీ మోదీ, ఆయన నాయకత్వం లోని ప్రభుత్వ అసమర్థతే కారణం అన్న అభిప్రాయం ఈ గ్రంథం అంతా పరుచుకుని కనిపిస్తుంది. కరోనా మహమ్మారి కారణంగా ఆర్థిక వ్యవస్థ కుదేలైన మాట వాస్తవమే అయినా ఆ గడ్డు రోజులు తొలగిపోయి నప్పటికీ మనం కరోనాకు ముందున్న స్థితికి చేరకపోవడానికి మోదీ ప్రభుత్వ అసమర్థతే కారణం అన్నది పరకాల గ్రంథంలో ప్రధానాంశంగా కనిపిస్తుంది. మన స్థూల జాతీయోత్పత్తి ఇప్పటికీ కరోనాకు ముందున్న స్థాయికి చేరుకోలేక పోయింది. 1980లో వాజపేయి, అద్వానీ లాంటి ఉద్దండులు బీజేపీని ఏర్పాటు చేసినప్పుడు గాంధేయ సోషలిజం తమ సిద్ధాంతం అన్నారు. ఆ తరవాత ఆ ప్రస్తావనే తీసుకురావడం లేదంటారు పరకాల. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు 1991లో ప్రవేశ పెట్టిన ఉదారవాద ఆర్థిక విధానాలు ఆ తరవాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వేగవంతంగా అమలు చేయడం లేదని బీజేపీ తూర్పార పట్టేది. కానీ ఇదే బీజేపీ 1991లో అమలు చేసిన ఉదారవాద ఆర్థిక విధానాలను దుయ్యబట్టింది. దీనికంతటికీ కారణం నికరమైన ఆర్థిక సిద్ధాంత ప్రాతిపదిక లేకపోవడమేనని పరకాల తేల్చారు. మోదీ సర్కారు సరఫరా వేపే చూస్తోంది తప్ప గిరాకీ అంశాన్ని పట్టించుకోవడం లేదన్నది ఆయన అభ్యంతరం. పెద్ద నోట్లను రద్దు చేసి మోదీ ప్రభుత్వం దేశవాసులందరినీ దొంగ దెబ్బ తీసింది. ఇది అత్యంత వినాశకరమైందిగా తేలింది. నల్ల ధనం అంటే నోట్ల కట్టల్లో మాత్రమే ఉండదని పరకాల అంటారు.

మరుగు దొడ్లు నిర్మించడం, ఆర్థిక లావాదేవీలను డిజిటలీకరించి యు.పి.ఐ.లాంటి వాటిని ప్రవేశ పెట్టడం, గ్యాస్ కనెక్షన్లు ఉచితంగా ఇవ్వడం లాంటివి జనానికి కొంత మేర ఉపకరించి ఉండవచ్చు. కానీ అది ఆర్థిక వ్యవస్థను ప్రోది చేయడానికి ఎంత మాత్రం ఉపకరించలేదు అని చాలా మందిలో ఉన్న అభిప్రాయాన్ని పరకాల నిర్భయంగా ఈ గ్రంథంలో చెప్పారు. ప్రజలకు వెసులు బాట్లు కల్పించడం, ఆర్థికాభివృద్ధి సాధించడం ఒకటే కాదన్నది పరకాల వాదన. మన దేశంలో కోట్లాది స్మార్ట్ ఫోన్లు, ఆపిల్ ఫోన్లు తయారు చేయడం ఆర్థికాభివృద్ధికి సూచిక కాదంటారాయన. హిందుత్వ బీజేపీ రాజకీయాలలో పాతుకు పోయింది. అయితే మోదీ ప్రభుత్వం అనుసరించే ఈ విలోమ విధానాలను మోసపూరితంగా అమలు చేస్తున్నారంటారు పరకాల. విచ్ఛిన్నకర రాజకీయాల ఆధారంగా బీజేపీ, మోదీ జన సమీకరణ చేయడంవల్ల అపారమైన ముప్పు పొంచి ఉందన్నది ఆయన బాధ. పది పదిహేనేళ్ల కింద విరివిగా వినిపించే సెక్యులరిజం అన్నమాటను సైతం బీజేపీ వికృతీకరించింది. తామే నికరమైన సెక్యులర్ వాదులమనీ, మిగతా పార్టీలన్నీ కుహనా సెక్యులర్‌పార్టీలని బీజేపీ ఊదరగొట్టిన సందర్భాలను గుర్తు చేసుకుంటే పరకాల భాష మనకూ అర్థం అవుతుంది. తామే అసలైన సెక్యులర్ వాదులమని బీజేపీ చెప్పుకోవడంలో పెద్దమోసం ఉందని పరకాల సూత్రీకరించారు.

దేశ విభజన సమయంలో ఉన్న వాతావరణం ఒక వర్గాన్ని పనిగట్టుకుని ద్వేషించడానికి ఎక్కువ ఆస్కారం ఉన్నా అప్పుడు అలా జరగలేదు కానీ ఇప్పుడు జరుగుతున్న దంతా అదేనంటారు పరకాల. 2014లో బీజేపీ అధికారంలోకి రావడానికి ముందు మతతత్వం గురించి మాట్లాడ లేదు. అభివృద్ధి, అవినీతినే ప్రధాన సమస్యలుగా ముందుకు తోసింది. అధికారంలోకి వచ్చిన తరవాత అసలు రంగు బయటపెట్టింది. మోసకారితనం అంటే ఇదే కదా! ఈ గ్రంథం పొడవునా ఆయన వ్యక్తులను ఎక్కడా విమర్శించ లేదు. మోదీ అసమర్థత, పాలనా విధానమే సకల రుగ్మతలకు కారణం అని మాత్రం మొహమాటం లేకుండా చెప్పారు. ఉత్తర భారతంలో ఉన్న విద్వేష వాతావరణం దక్షిణభారతాన్ని కూడా ఆవహించే ప్రమాదం ఉందంటారు. మోదీ సామర్థ్యం అంతా మతతత్వాన్ని ప్రోత్సహించడం, విద్వేషం రెచ్చగొట్టడం, జనాన్ని చీల్చడంలో మాత్రమే ఉందని ఈ గ్రంథంలో నిర్భయంగా వెల్లడించడం చూస్తే ఆశ్చర్యం వేస్తుంది.

-ఆర్వీ రామారావ్

కర్నాటకలో ఓటమిపై బీజేపీ అంతర్మథనం

పూర్తిస్థాయి విశ్లేషణకు నిర్ణయం

ఇది మోదీ ఓటమి కాదన్న బొమ్మై

బెంగళూరు : కర్నాటక ఎన్నికల్లో ఓటమికి గల కారణాలను తెలుసుకోవడానికి బీజేపీ సమగ్ర విశ్లేషణ చేయనుంది. పార్టీ పరాజయానికి గల కారణాలను తెలుసుకోవడానికి మొత్తం ఎన్నికల ఫలితాలు, నియోజకవర్గాల వారీ ఫలితాలను కూడా సమగ్రంగా విశ్లేషించాలని బీజేపీ రాష్ట్ర శాఖ నిర్ణయించిందని సీఎం పదవికి రాజీనామా చేసిన బసవరాజ్ బొమ్మై ఆదివారం తెలిపారు. 224 మంది సభ్యుల అసెంబ్లీకి మే 10న జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ 136 సీట్లతో అఖండ విజయం సాధించగా, అధికార బీజేపీ, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ నేతృత్వంలోని జనతాదళ్ (సెక్యులర్) వరుసగా 66, 19 స్థానాల్లో గెలుపొందాయి. ఇదిలాఉండగా, కర్నాటక ఎన్నికల్లో బీజేపీ ఓటమి... ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఓటమి అని కాంగ్రెస్ వాదనను బొమ్మై తోసిపుచ్చారు. పార్టీ పని తీరుకు అనేక అంశాలు దోహదపడ్డాయని, వాటన్నింటినీ విశ్లేషిస్తామని చెప్పారు. దీనికి సంబంధించి త్వరలో కొత్తగా ఎన్నికయిన సభ్యులు, అభ్యర్థులందరితో సమావేశం నిర్వహించనున్నారు. బొమ్మై సహా కొందరు బీజేపీ నేతలు ఆదివారం ఇక్కడి పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు నళిన్‌కుమార్ కటీల్ నేతృత్వంలో సమావేశమై చర్చలు జరిపారు. 'మేము ఫలితాల గురించి, వివిధ ప్రాంతాల నుంచి సమాచారాన్ని పొందడం గురించి అనధికారిక చర్చలు చేశాము. మొత్తం ఫలితాలపై సవివరంగా విశ్లేషించి నియోజకవర్గాల వారీగా విశ్లేషించుకోవాలని ఓ నిర్ణయానికి వచ్చాము' అని బొమ్మై చెప్పారు. సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ ఓట్ల శాతం అలాగే ఉన్నప్పటికీ సీట్లు తగ్గాయన్నారు. నియోజకవర్గాల వారీగా ఓట్ల శాతం విశ్లేషణ సెగ్మెంట్ వారీగా వ్యతిరేకత వంటి కారణాలను ఇవ్వవచ్చు. రాబోయే రోజుల్లో పార్టీని నిర్వహించడం, బలోపేతం చేయడం గురించి సవివరమైన చర్చలు జరపడానికి ఎన్నికయిన సభ్యులు, అభ్యర్థులందరితో సమావేశం నిర్వహించాలని కూడా నిర్ణయించాము' అని ఆయన చెప్పారు. బీజేపీ ఎన్నికల కోసం మాత్రమే పని చేయదని చెప్పిన బొమ్మై... పార్టీని నిర్వహించడం నిరంతర ప్రక్రియ అని అన్నారు. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి కేవలం 40 సీట్లు వచ్చిన ఉదాహరణను ఉటంకిస్తూ, 'కానీ 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి 19 సీట్లు వచ్చాయి. నేడు, మేము మరింత మెరుగైన స్థితిలో ఉన్నాము. రాబోయే రోజుల్లో 2024 లోక్‌సభ ఎన్నికలకు అన్ని సన్నాహాలు చేస్తాము. ఓటమిని అత్యంత వినయంతో అంగీకరిస్తూ, దానికి కారణాలను గుర్తించి, సరిదిద్దుకుని ముందుకు సాగుతాము' అని అన్నారు. కర్నాటక ఎన్నికల ఫలితాలను మోదీ ఓటమిగా పేర్కొంటున్న కాంగ్రెస్‌పై అడిగిన ప్రశ్నకు సీఎం స్పందిస్తూ, 'ఇది మోదీ ఓటమి కాకపోవచ్చు. మోదీ అంటే కర్నాటకకే కాదు. యావత్ దేశానికీ. ఆయన ఇక్కడ ప్రచారానికి వచ్చారు. కర్నాటకలో కాంగ్రెస్ గెలిచి ఉండవచ్చు కానీ దేశవ్యాప్తంగా ఓటమి చవిచూసింది. ఇది స్థానిక నేతల విజయమా లేక రాష్ట్ర నాయకుల విజయమా?' అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓటమికి బాధ్యత వహిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కటీల్ రాజీనామా చేసే అవకాశం ఉందా అనే ప్రశ్నకు బొమ్మై సమాధానమిస్తూ, అలాంటిదేమీ లేదని, దానిపై చర్చ జరగలేదన్నారు. ప్రతిపక్ష నేత ఎవరనే దానిపై కూడా చర్చలు జరగలేదని తెలిపారు. హిందుత్వ అజెండా ఆధారంగా బీజేపీ ఈ ఎన్నికల్లో పోరాడలేదని పేర్కొంటూ, 'ఇది కొంతమంది మనస్సులో ఉంది. 'డబుల్ ఇంజన్ ప్రభుత్వం' అభివృద్ధి అజెండా ఆధారంగా మేం పోరాడాము. కాంగ్రెస్, దాని మేనిఫెస్టో ప్రజలను కుండబద్దలు కొట్టడానికి ప్రయత్నించింది' అని అన్నారు. లింగాయత్ బెల్ట్‌లో కాంగ్రెస్ బాగా పని చేయడం గురించి ఆయన మాట్లాడుతూ 'లింగాయత్ బెల్ట్ అయినా, వొక్కలిగ బెల్ట్ అయినా, ఇది వర్గాల కలయిక. ఇది మిమ్మల్ని గెలిపించే లేదా ఓడిపోయేలా చేసే ఒక సంఘం మాత్రమే కాదు. అభ్యర్థి ఎంపిక, అధికారంపై కూడా ఆధారపడి ఉంటుంది. అందువల్ల మేము వివరణాత్మక విశ్లేషణ చేస్తాము' అని బొమ్మై చెప్పారు.

పశ్చిమబెంగాల్‌లో విపత్తు నిర్వహణ సిబ్బంది అప్రమత్తం

కోల్‌కతా: మోచా తీవ్ర తుపానుగా బలపడి ఆదివారం బంగ్లాదేశ్, మైన్మార్ తీరప్రాంతాలను తాకే అవకాశం ఉన్నందున పశ్చిమ బెంగాల్‌లోని పుర్బా మేదినీపూర్, దక్షిణ 24 పరగణాస్ జిల్లాల తీరప్రాంతాల వెంబడి విపత్తు నిర్వహణ దళ సిబ్బంది అప్రమత్త మయ్యారు. సముద్రం అల్లకల్లోలంగా మారడంతో పుర్బా మేదినీపూర్ జిల్లాలోని దిఘ-మందర్మణి తీర ప్రాంతాల్లో డైవర్లతో సహా ఏడు బృందాల ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని మోహరించినట్లు ఓ అధికారి తెలిపారు. సముద్రం దగ్గరకు నిషేధించిన నేపథ్యంలో పర్యాటకులు , స్థానికుల కదలికలపై నిఘా ఉంచడానికి దక్షిణ 24 పరగణాల జిల్లాలోని బక్కలి సముద్ర తీరంలో 100 మందికి పైగా రాష్ట్ర విపత్తు నిర్వహణ బృందం సిబ్బందిని మోహరించారు. సోమవారం తుపాను తీరం దాటే అవకాశం ఉన్నందున అత్యవసర సమయాల్లో రెండు జిల్లాల్లోని తీర ప్రాంతాల వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా సుందర్‌బన్స్‌లోని కట్టల ఉల్లంఘనలను యుద్ధ ప్రాతిపదికన పూడ్చారు, అయితే పోలీసులు , అధికారులు ప్రజలెవరూ సముద్రం దగ్గరికి రాకుండా లౌడ్‌స్పీకర్‌ల ద్వారా హెచ్చరించారు. 'మోచా తుఫాను పశ్చిమ బెంగాల్‌ను దాటేస్తుందని వాతావరణ కార్యాలయం అంచనా వేసినప్పటికీ, ఏదైనా మార్పు వచ్చినట్లయితే మేము అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నాము. దక్షిణ 24 పరగణాలు, పుర్బా మేదినీపూర్ జిల్లాల్లోని లోతట్టు తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలను మేము మా ప్రాంతానికి తరలించాము. ఈ ప్రాంతాలకు సురక్షిత షెల్టర్లు, తగినన్ని సహాయక సామగ్రిని పంపాము' అని మరొక అధికారి పీటీఐకి తెలిపారు.శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని వాతావరణశాఖ హెచ్చరించింది. అతి తీవ్ర తుపానుగా మారిన మోచా... దక్షిణ బంగ్లాదేశ్, ఉత్తర మయన్మార్ తీరాన్ని దాటే అవకాశం ఉందని పేర్కొంది.

కల్తీ మద్యం తాగి ఐదుగురి మృతి

విల్లుపురం: తమిళనాడులోని విల్లుపురం జిల్లాలో కల్తీ మద్యం తాగి ఐదుగురు మృతి చెందారు. శనివారం రాత్రి ఇక్కడికి సమీపంలోని మరకానం వద్ద ఈ ఘటన జరిగిందని, బాధితులు 45 నుంచి 55 ఏళ్ల మధ్య వయస్కులేనని పోలీసులు ఆదివారం తెలిపారు. కల్తీ మద్యం తాగి అస్వస్థతతకు గురైన ఐదుగురినీ శనివారం అర్ధరాత్రి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చగా, మొదట వారిలో ముగ్గురు మరణించారు. చికిత్స పొందుతూ మహిళతో సహా మరో ఇద్దరు ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఒకరిని అరెస్టు చేయగా, మరికొందరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. కాగా ఈ ఘటనకు సంబంధించి నలుగురు పోలీసులను సస్పెండ్ చేసినట్లు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తెలిపారు. కల్తీ మద్యం, డ్రగ్స్‌ను నియంత్రించడానికి తన ప్రభుత్వం కట్టుబడి ఉందన్న ముఖ్యమంత్రి స్టాలిన్... ఈ సంఘటనకు సంబంధించి ఇద్దరు ఇన్‌స్పెక్టర్లతో సహా నలుగురు పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు చెప్పారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థికసాయాన్ని ప్రకటించారు. కాగా ఈ ఘటనపై ప్రతిపక్ష అన్నాడీఎంకే, పీఎంకేలు అధికార డీఎంకేపై విమర్శలు గుప్పించాయి. ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్ష నాయకుడు కె.పళనిస్వామి మాట్లాడుతూ... తమ పార్టీ అధికారంలో ఉన్న పదేళ్ల పాలనలో (2011-21) అక్రమ మద్యానికి చోటు లేదని, మరక్కానం మరణాలకు అధికార డీఎంకే అసమర్థతే కారణమని ఆరోపించారు.

ప్రజల హృదయాలను గెలవండి: సిబల్

న్యూఢిల్లీ: కర్ణాటక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ భారీ విజయం సాధించడంపై ఆ పార్టీ మాజీనేత, న్యాయవాది కపిల్ సిబల్ హర్షం వ్యక్తం చేశారు. అయితే రాష్ట్రంలో రాబోయే ఐదేళ్లపాటు నిజాయితీగా, వివక్ష లేకుండా సమర్థ పాలన అందించడం ద్వారా ప్రజల హృదయాలను గెలుచుకోవాలని కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం ట్వీట్ చేశారు. 'కాంగ్రెస్ కర్ణాటకలో అద్భుతమైన పునరాగమనం చేసింది, 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు పునర్వైభవం సాధించేందుకు ఈ విజయం ఎంతో కీలకం. మంచి మెజారిటీతో బీజేపీని దాని ఏకైక దక్షిణ కోట నుండి తొలగించింది' అని పేర్కొన్నారు. యూపీఏ-1, 2 కాలంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన సిబల్, గత ఏడాది మేలో కాంగ్రెస్‌ను వీడి సమాజ్‌వాదీ పార్టీ మద్దతుతో స్వతంత్ర సభ్యునిగా రాజ్యసభకు ఎన్నికయ్యారు. అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడే లక్ష్యంతో అతను ఇటీవల రాజకీయేతర 'ఇన్సాఫ్' వేదికను ప్రారంభించారు.

సీఐఎస్‌సీఈలో బాలికలదే పైచేయి

పదిలో 98శాతం - 12లో 96శాతం ఉత్తీర్ణత

న్యూఢిల్లీ: కౌన్సిల్ ఫర్ ది ఇండియన్ స్కూల్ సర్టిఫికేట్ ఎగ్జామినేషన్స్ (సీఐఎస్‌సీఈ) ఫలితాలు విడుదలయ్యాయి. పదో తరగతిలో మొత్తంగా 98.94శాతం ఉత్తీర్ణత నమోదు కాగా 12వ తరగతిలో 96.93శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. రెండు తరగతుల పరీక్షల్లోనూ బాలుర కంటే బాలికలదే పైచేయిగా ఉన్నదని సీఐఎస్‌సీఈ కార్యదర్శి గెర్రీ అరాథూన్ తెలిపారు. పదో తరగతి (ఐసీఎస్‌ఈ)లో మొత్తం 63 సబ్జెక్టుల్లో (21 భారతీయ, 14 విదేశీయ భాషలలో, రెండు సంప్రదాయ భాషల్లో) రాత పరీక్షలను నిర్వహించారు. అలాగే పన్నెండో తరగతి (ఐఎస్‌సీ) రాతపరీక్షలు 47 సబ్జెక్టులలో (12 భారతీయ, మూడు విదేశీ భాషల్లో, ఒక సంప్రదాయ భాషలో) జరిగాయి. పదో తరగతిలో 99.80శాతం మార్కులను తొమ్మిది మంది సాధించి టాపర్లుగా నిలిచారు. వీరిలో రుషిల్ కుమార్, అనన్యా కార్తిక్, శ్రేయా ఉపాధ్యాయ, అద్వయ్ సర్దేశాయ్, యశ్ మనీశ్ భసీన్, తనయ్ సుశీల్‌షా, హియా సంఘ్వీ, అవిషీ సింగ్, సంబిత్ ముఖోపాధ్యాయ ఉన్నారు. 12వ తరగతి విద్యార్థులు ఐదుగురు 99.75శాతం మార్కులు సాధించారు. టాపర్లలో రియా అగర్వాల్, ఇషితా భట్టాచార్య, మహమ్మద్ ఆర్యన్ తారిఖ్, షుభమ్ కుమార్ అగర్వాల్, మాన్యగుప్తా ఉన్నారు.

బీజేపీకి బుద్ధిచెప్పాల్సిందే: దిగ్విజయ్



కట్నీ: మధ్యప్రదేశ్‌లోనూ భారతీయ జనతా పార్టీ (బీజేపీకి) కర్నాటక తరహాలో బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ నొక్కిచెప్పారు. ఈ ఏడాది చివరిలో మధ్యప్రదేశ్ అసెంబ్లీకి ఎన్నికలు జరగబోతున్న దృష్ట్యా ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మార్పుకు ఇదే సమయమని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. కర్నాటకలో బీజేపీని ఏ స్థాయిలో ఓడించారో మధ్యప్రదేశ్‌తో సహా మిగతా చోట్ల కూడా అలాగే జరగాలని, ఆ పార్టీ అహంకారాన్ని అణచాలన్నారు. తమకు అధికార దాహం లేదని అన్నారు. దేశంలో ప్రజలు, కాంగ్రెస్‌వారికి జరుగుతున్న అన్యాయం ఆక్షేపణీయమన్నారు. పదేళ్లు మధ్యప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా ఉన్నాగానీ ఏ ఒక్క బీజేపీ కార్యకర్తను వేధించలేదని ఆయన చెప్పారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ కార్మికులకు కూలి కూడా అందడంలేదని దిగ్విజయ్ సింగ్ చెప్పారు. పంచాయతీ రాజ్... 'సర్కారీ రాజ్'గా మారిందని, 99శాతం గ్రామ పెద్దలు అసంతృప్తిగా ఉన్నారని, తమ అధికారాల పునరుద్ధరణకు డిమాండ్ చేస్తున్నారన్నారు. కమల్‌నాథ్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2003 తరహాలో పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేస్తామని చెప్పారు. పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న తాను సీఎం రేసులో ఉండబోనని, ఆయనే పార్టీ సీఎం అభ్యర్థి అవుతారని దిగ్విజయ్ సింగ్ అన్నారు.

బ్రహ్మోస్ పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ: భారత నౌకాదళం తన ఫ్రంట్‌లైన్ గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్ ఐఎన్‌ఎస్ మోర్ముగావ్‌ను ఉపయోగించి ఆదివారం బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిని ఆదివారం విజయవంతంగా పరీక్షించింది. ఈ క్షిపణి నిర్దిష్ట లక్ష్యాన్ని ఛేదించిందని అధికారులు తెలిపారు. గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ ఐఎన్‌ఎస్ మార్మగావ్... దీనిలోని ఆయుధాలు స్వదేశంవేనని, ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా తయారు చేసినవని పేర్కొన్నారు. గతేడాది డిసెంబర్ 18న రక్షణ మంత్రి సమక్షంలో డిస్ట్రాయర్లను జల ప్రవేశం చేయించారు. ఇందులో రెండోది ఐఎన్‌ఎస్ మార్మగావ్. భారత నావికా దళంలోని వార్‌షిప్ డిజైన్ బ్యూరోలో దీని ఆకృతిని రూపొందించగా... మజగావ్ డాక్ షిప్‌లో తయారు చేశారు. గోవాలోని మార్మగావ్ నౌకాశ్రయం పేరును ఈ మిస్సైల్ డిస్ట్రాయర్‌కు పెట్టారు. 15బీ స్టెల్త్ గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ల ప్రాజెక్టులో ఐఎన్‌ఎస్ మార్మగావ్ రెండోది కాగా... ఇందులో అత్యాధునిక ఆయుధ వ్యవస్థలు ఉన్నాయి. ఉపరితలం నుంచి ఉపరితలానికి, ఉపరితలం నుంచి గగనతలానికి క్షిపణులను ప్రయోగించే వీలుంటుంది.

కాంగ్రెస్‌కు హరపనహళ్లి స్వతంత్ర ఎమ్మెల్యే మద్దతు

బెంగళూరు : హరపనహళ్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికయిన లతా మల్లికార్జున్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి బేషరతుగా మద్దతు ఇస్తున్నారని కర్నాటక ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రణదీప్ సింగ్ సూర్జేవాలా ఆదివారం తెలిపారు. లతా మల్లికార్జున్, ప్రముఖ నాయకుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి, దివంగత ఎం.పి.ప్రకాష్ కుమార్తె. 'ఆమె సైద్ధాంతిక మూలాలు, కాంగ్రెస్ ఆదర్శాలకు కట్టుబడి ఉన్నందున కర్నాటకలో కాంగ్రెస్ పార్టీకి బేషరతుగా మద్దతు ఇచ్చింది. ఆమెకు, ఆమె భర్త మల్లికార్జున్‌కి, మద్దతుదారులందరికీ, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు. మేము కలిసి 6.5 కోట్ల మంది కన్నడిగులకు సేవ చేస్తాం' అని సూర్జేవాలా ట్వీట్‌లో పేర్కొన్నారు. హరపనహళ్లి స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి జి.కరుణాకరరెడ్డిపై లతా మల్లికార్జున్ 13,845 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఎం.పి.ప్రకాష్ ఒక ప్రముఖ సోషలిస్ట్, జనతా పరివార్ నాయకుడు. ఆయన తన చివరి రోజుల్లో 2018లో మరణించిన తన కుమారుడు ఎం.పి.రవీంద్ర కొనసాగిన కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఫిరాయింపుదారులకు ఎదురుదెబ్బ

బీజేపీకి సహకరించిన 8మంది ఓటమి

బెంగళూరు: కర్నాటక అసెంబ్లీ ఎన్నికలలో ఓటర్లు ఫిరాయింపుదారులకు తగిన సమాధానం చెప్పారు. నాలుగేళ్ల కిందట బీజేపీకి మద్దతిచ్చి ఆ పార్టీ ప్రభుత్వం ఏర్పాటుకు సహకరించిన 8 మంది కాంగ్రెస్ రెబల్స్ ఈసారి ఎన్నికల్లో ఓడిపోయారు. 2019లో కాంగ్రెస్, జేడీ(ఎస్)కు చెందిన సుమారు 16 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేశారు. బీజేపీకి మద్దతివ్వడంతో హెచ్‌డీ కుమారస్వామి నేతృత్వంలోని జేడీ(ఎస్), కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోయింది. 16 మంది ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు వేయడంతో అనంతరం వారంతా బీజేపీలో చేరారు. అదే ఏడాది ఉప ఎన్నికలు నిర్వహించగా బీజేపీ తరపున పోటీ చేసి గెలిచి బీజేపీ ప్రభుత్వంలో మంత్రులయ్యారు. కాగా, ఈ ఏడాది మే 10న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా వారంతా బీజేపీ తరుపున పోటీ చేశారు. అయితే శనివారం వెల్లడైన ఫలితాల్లో 8 మంది కాంగ్రెస్ రెబల్ నేతలు ఈసారి ఓడిపోయారు. బీజేపీ మంత్రులైన వీరు కాంగ్రెస్ అభ్యర్థుల చేతుల్లో పరాజయాన్ని చవిచూశారు. కాగా, 2019లో బీజేపీలో చేరిన ఆరుగురు కాంగ్రెస్ రెబల్ నేతలు ఈ ఎన్నికల్లో విజయం సాధించారు. రోషన్ బేగ్, ఏహెచ్ విశ్వనాథ్‌కు బీజేపీ టికెట్ నిరాకరించడంతో ఈసారి ఎన్నికల్లో పోటీ చేయలేదు.

కేజ్రీవాల్‌తో ఆదిత్యఠాక్రే భేటీ

న్యూఢిల్లీ: శివసేన (యూబీటీ) నాయకుడు, మహారాష్ట్ర మాజీ మంత్రి ఆదిత్య ఠాక్రే ఆదివారం ఇక్కడ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఆయన నివాసంలో కలుసుకున్నారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలపై చర్చించారు. ఠాక్రేతో సమావేశమైన ఫోటోలను కేజ్రీవాల్ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. 'ఈరోజు నా నివాసంలో ఆదిత్య ఠాక్రేకి ఆతిథ్యం ఇచ్చే అవకాశం నాకు లభించింది. ప్రస్తుత రాజకీయ పరిణామాలపై ఆయనతో సవివరంగా మాట్లాడాను' అని ఆప్ జాతీయ కన్వీనర్ ట్వీట్ చేశారు.

సీఎం పదవికి బొమ్మై రాజీనామా

సీఎం అభ్యర్థులు సిద్ధ, డీకేకు శుభాకాంక్షలు

బెంగళూరు : కర్నాటక తదుపరి ముఖ్యమంత్రి రేసులో ఉన్న కాంగ్రెస్ నేతలు సిద్ధరామయ్య, డికె.శివకుమార్‌కు పదవీ విరమణ చేసిన ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ ఓటమి తర్వాత బొమ్మై శనివారం రాత్రి కర్నాటక గవర్నర్‌కు రాజీనామా లేఖను సమర్పించారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు సిద్ధరామయ్య, కర్నాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డి.కె.శివకుమార్ సీఎం పదవికి ముందంజలో ఉన్నారు. బొమ్మై ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ వారిద్దరికీ నేను శుభాకాంక్షలు తెలుపుతున్నా అని అన్నారు. ముఖ్యమంత్రి రేసులో ఉన్న సిద్ధరామయ్య, శివకుమార్‌కు మిత్రుడిగా ఏం చెప్పాలనుకుంటున్నారని ఓ ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. కాంగ్రెస్ తన మేనిఫెస్టోను అమలు చేయడంపై బీజేపీ ఎలా దృష్టి పెడుతుంది అనే ప్రశ్నకు బొమ్మై... 'వారు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, మంత్రివర్గం సమావేశమై వారి నిర్ణయాలను తెలియజేయనివ్వండి. ఏమి అమలు చేస్తారో చూద్దాం, వేచి చూద్దాం' అని తెలిపారు. ఇదిలాఉండగా, యడియూరప్పను తప్పించిన అనంతరం బీజేపీ అధిష్ఠానం బొమ్మైకి సీఎం పగ్గాలు అప్పగించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో 19 నెలల 17 రోజుల పాటు బసవరాజ్ బొమ్మై ముఖ్యమంత్రిగా విధులు నిర్వర్తించారు. అంతకుముందు కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటమికి పూర్తి బాధ్యత వహిస్తానని బొమ్మై అన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా పని చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ వ్యవస్థీకృత ఎన్నికల వ్యూహం ఫలించిందని, దాని విజయానికి ప్రధాన కారణాలలో అది కూడా ఒకటని ఆయన అన్నారు. ఈ ఓటమికి వివిధ కారణాలు ఉన్నందున పూర్తి విశ్లేషణ చేస్తామని బొమ్మై అన్నారు. తమది జాతీయ పార్టీ అని, తప్పులను సరిదిద్దుకోవడం ద్వారా లోక్‌సభ ఎన్నికల్లో గెలవడానికి సంస్థాగతంగా, పరిపాలనాపరంగా అవసరమైన అన్ని సన్నాహాలు చేస్తామని బొమ్మై చెప్పారు. ఈ ఎన్నికలలో మోదీ, సామంత్రం పని చేయలేదని మీడియా ప్రతినిధులు అడగగా... ఈ పరిణామానికి అనేక కారణాలు ఉన్నాయని దాటవేశారు. తనను ఎన్నుకున్నందుకు షిగ్గావ్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

కన్నడనాట ఫ్లెక్సీల వార్

బెంగళూరు: కర్నాటక అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో ముఖ్యమంత్రి పీఠం కోసం కేపీసీసీ చీఫ్ డీకే శివకుమార్, మాజీ సీఎం సిద్ధరామయ్య వర్గీయుల మధ్య పోటీ నెలకొంది. ఈ క్రమంలో రాష్ట్రంలో ఉభయ పక్షాల మధ్య ఫ్లెక్సీల వార్ మొదలైంది. ఆదివారం ఉదయం బెంగళూరులో ఇద్దరి నాయకుల అభిమానులు వివిధ రకాల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సీఎం పదవిలో తమ అభిమాన నాయకుడే ఉండాలని అకాంక్షించారు. రాష్ట్ర ఎన్నికల సమయంలో రెండు వర్గాలు ఏకతాటిపై నడిచి పార్టీకి విజయాన్ని అందించేందుకు కృషి చేశాయి. కానీ, ఫలితాల అనంతరం తమ నాయకుడికి అనుకూలంగా ప్రకటనలు చేయడం మొదలుపెటాయి.

సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర శనివారం విలేకరులతో మాట్లాడుతూ తన తండ్రి సీఎం పోస్టుకు అర్హుడని పేర్కొన్నారు. మరోవైపు డీకే శివకుమార్ సోదరుడు సురేష్ మాట్లాడుతూ తన సోదరుడిని ముఖ్యమంత్రి చేస్తే రాష్ట్రం సంతోషిస్తుందన్నారు. 'కనకపుర బండ'గా అభిమానులు పిలిచే 62 ఏళ్ల డీకే శివకుమార్ కర్నాటక కాంగ్రెస్‌కు జీవంపోసిన నేత. కాంగ్రెస్ ట్రబుల్ షూటర్‌గా గుర్తింపు పొందిన డీకే 2017 వరకు ఒక సాధారణ నాయకుడే. ఆ ఏడాది ఆగస్టులో గుజరాత్‌కు చెందిన అహ్మద్ పటేల్ రాజ్యసభ సభ్యుడిగా గెలిచేందుకు అవసరమైన ఎమ్మెల్యేలకు బెంగళూరులో విడిది ఏర్పాటు చేసి అధిష్ఠానం దృష్టిలో పడ్డారు. ఆయనకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్, సోనియా గాంధీల అండదండలున్నాయి. ఇక రాష్ట్ర రాజకీయాల్లో మంచి పేరున్న నేతల్లో సిద్ధరామయ్య ప్రముఖుడు. దేవరాజ్ అరసు తర్వాత ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పని చేసింది ఆయనే. అహింద (బలహీనవర్గాల) సముదాయానికి ప్రతినిధిగా ఉండేందుకు ఇష్టపడే ఆయన జనతా పరివార్ నుంచి 2006లో కాంగ్రెస్‌లోకి వచ్చారు. జనతాదళ్‌లోనూ ఉప ముఖ్యమంత్రిగా, ఆర్థిక మంత్రిగా పని చేసిన సిద్ధరామయ్య ఇప్పటి వరకు అత్యధిక సార్లు (13సార్లు) బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనత సొంతం చేసుకున్నారు. 2013లో కాంగ్రెస్‌కు 122 స్థానాల విజయాన్ని అందించడంలో సిద్ధరామయ్య పాత్రను విస్మరించని అధిష్ఠానం ముఖ్యమంత్రి బాధ్యతలను అప్పగించింది. అపార రాజకీయ అనుభవం ఉన్న సిద్ధరామయ్య పార్టీని, ప్రభుత్వాన్ని ఒంటిచేత్తో నడపగలరు.

'ది కేరళ స్టోరీ'పై

చౌహాన్ చౌకబారు వాదన

- ఎంపీలోనే 36 వేల మంది మహిళల అదృశ్యం
- బెంగాల్ తర్వాత ఇక్కడే అత్యధికం

భోపాల్ : దేశంలో రోజురోజుకు మహిళలు అదృశ్యమవుతున్న సంఘటనలపై బీజేపీ ముఖ్యమంత్రులు, నాయకులు చౌకబారు వాదనలు చేస్తున్నారు. 'లవ్ జిహాద్', మతమార్పిడి, తీవ్రవాదానికి వ్యతిరేకంగా అవగాహన కల్పించే ప్రయత్నంలో మధ్య ప్రదేశ్ ప్రభుత్వం మే 6న వివాదాస్పద చిత్రం 'ది కేరళ స్టోరీ' ని పన్ను రహితంగా ప్రకటించింది. అయితే ఆ రాష్ట్రమే... పశ్చిమ బెంగాల్ తర్వాత దేశంలో రెండవ అత్యధిక మహిళల తప్పిపోయిన కేసుల రికార్డును కలిగి ఉంది. జాతీయ నేర నమోదు సంస్థ 2021 నివేదిక ప్రకారం, ఇప్పటివరకు 2,830 మంది మైనర్ బాలికలతో సహా 36,104 మంది తప్పిపోయిన మహిళలను గుర్తించడంలో మధ్య ప్రదేశ్ రాష్ట్రం విఫలమైంది. 40,719 మంది బాధితులతో దేశంలో తప్పిపోయిన మహిళల సూచికలో పశ్చిమ బెంగాల్ అగ్రస్థానంలో ఉంది. వివాదాస్పద చిత్రం 'ది కేరళ స్టోరీ'ని వక్రీకరించి, ద్వేషాన్ని పెంపొందించిందంటూ ఆరోపణలు వస్తున్నాయి. అయితే చిత్ర నిర్మాతల ప్రకారం, ఈ చిత్రం క్రమపద్ధతిలో మతం మార్చబడి, వారి జీవితాలను నాశనం చేసిన ముగ్గురు యువతుల కథల సంకలనం. ఇది కేరళ నుంచి తప్పిపోయిన 32 వేల మంది మహిళల కథ అని గతంలో పేర్కొన్న చిత్ర నిర్మాతలు, కేరళ ప్రభుత్వం వారి వాదనలను తిరస్కరించడంతో దానిని మూడుకు తగ్గించారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఒక బలమైన ప్రకటనలో ఇది తప్పుడు కథ అని, ఇది 'సంఘ్ పరివార్ వారి ప్రచారాన్ని వ్యాప్తి చేయడానికి అబద్ధాల కర్మాగారం ఉత్పత్తి' అని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి ప్రకటన తర్వాత, చిత్రం బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పన్ను రహితం చేశారు. అయితే బీజేపీయేతర రాష్ట్రాల నుంచి వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఒక నెలపాటు పన్నును మినహాయించిన ఐదు రోజుల్లో వివాదానికి దారితీసింది. రాజకీయ ప్రతిఘటన తర్వాత మళ్లీ పునరుద్ధరించారు. మే 6న చిత్రం విడుదలైన ఒక రోజు తర్వాత, ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ, 'లవ్ జిహాద్ ఉచ్చులో చిక్కుకున్న కుమార్తెల జీవితం ఎలా నాశనం అవుతుందో ఈ చిత్రం చూపిస్తుంది. ఈ చిత్రం ఉగ్రవాదం, సంభాషణల రూపకల్పనను కూడా బహిర్గతం చేస్తుంది' అని చెప్పుకొచ్చారు. మీడియా కోసం విడుదల చేసిన వీడియో సందేశంలో 'మేము ఇప్పటికే బలవంతపు మత మార్పిడికి వ్యతిరేకంగా చట్టాన్ని తీసుకువచ్చినప్పటికీ, ఈ చిత్రం సమస్య గురించి అవగాహన కల్పిస్తుంది. ఈ సినిమాని తల్లిదండ్రులు, పిల్లలు, ఆడపిల్లలు తప్పక చూడాలి. అందుకే మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఈ చిత్రానికి పన్ను రహితంగా ప్రకటించింది' అని తెలిపారు. అయితే మధ్య ప్రదేశ్ రాష్ట్రంలో 2019 నుంచి 2021 మధ్యకాలంలో 25,209 మంది మైనర్లు తప్పిపోయినట్లు నివేదించబడిన సమయంలో నాలుగు పర్యాయాలు ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రకటన వెలువడింది. ఆచూకీ కనిపించకుండా పోయిన వారిలో 2,830 మంది మైనర్ బాలికలను పోలీసులు గుర్తించలేకపోయారు. దీంతో బీహార్, పశ్చిమ బెంగాల్ తర్వాత అత్యధిక బాలికలు తప్పిపోయిన కేసులతో మధ్యప్రదేశ్ మూడవ రాష్ట్రంగా (ఢిల్లీ కేంద్రపాలిత ప్రాంతం మినహా) అవతరించింది. బీహార్‌లో 5,366 మంది మైనర్లు అదృశ్యమైనట్లు నివేదించబడిన తర్వాత వారి జాడ తెలియలేదు. ఎన్‌సీఆర్‌బీ ప్రకారం 5,609 కేసులతో పశ్చిమ బెంగాల్ జాబితాలో అగ్ర స్థానంలో ఉంది. ఇక తప్పిపోయిన మహిళల కేసుల విషయానికొస్తే, మధ్యప్రదేశ్‌లో 2019 నుంచి 2021 మధ్యకాలంలో 99,119 మంది మహిళలు అదృశ్యమయ్యారు. రికవరీ రేటు 47 శాతం నుంచి 51 శాతం మధ్య హెచ్చుతగ్గులకు లోనవుతున్నందున, తప్పిపోయిన మహిళల్లో సగానికిపైగా రాష్ట్రం కోలుకుంది. అయితే 33,274 మందిని గుర్తించడం లేదా తిరిగి పొందడం సాధ్యం కాలేదని నివేదిక వెల్లడించింది. అదే సమయంలో, ఈ చిత్రం నిర్మించిన కేరళలో 24,258 మిస్సింగ్ కేసులు నమోదయ్యాయి. ఇందులో 2,837 తప్పిపోయిన బాలికల కేసులు ఉన్నాయి. రికవరీ రేటులో 90 శాతం కంటే ఎక్కువ. ఎన్‌సీఆర్‌బీ వివరాల ప్రకారం, కేరళ పోలీసులు తప్పిపోయిన మహిళలు, మైనర్ బాలికలలో ఎక్కువ మందిని తిరిగి పొందారు. 2021 నాటికి, రాష్ట్రంలో 366 మంది మహిళలు, 32 మంది గుర్తించబడని మైనర్లు ఉన్నారు. మధ్యప్రదేశ్‌లో 36,000 కంటే ఎక్కువ మంది మహిళలు లేదా మైనర్‌లు ఉన్నారు. సీఎం చౌహాన్ ప్రకటనపై భారతీయ ముస్లిం మహిళా ఆందోళన్ రాష్ట్ర కన్వీనర్ సఫియా అక్తర్ మాట్లాడుతూ 'ది కేరళ స్టోరీని పన్ను రహితంగా చేయడం ద్వారా సీఎం చౌహాన్ తన క్రూరమైన వాదనలకు మద్దతు ఇవ్వడానికి సమాచారం లేనప్పుడు తప్పిపోయిన లేదా గుర్తించబడని మహిళల కేసుల పెరుగుదల వెనుక లవ్ జిహాద్, మత మార్పిడి లేదా ఉగ్రవాదం కారణమని చెప్పడానికి ప్రయత్నిస్తున్నారు' అని ఆరోపించారు. మధ్యప్రదేశ్ తన 16-17 సంవత్సరాల పదవీకాలంలో దేశంలో మహిళలకు అత్యంత అసురక్షిత రాష్ట్రంగా మారినందున, అతను రాజకీయ ప్రయోజనాల కోసం ఒక నిర్దిష్ట సమాజంపై నిందలు మోపుతున్నాడని అన్నారు. మధ్యప్రదేశ్‌లో చిన్నారులపై జరుగుతున్న నేరాల ఆందోళనకర పరిస్థితులపై సీఆర్‌వై ప్రాంతీయ డైరెక్టర్ సోహా మొయిత్రా మాట్లాడుతూ ఎన్‌సీఆర్‌బీ ప్రకారం, సగటున 25 అపహరణ కేసులు, 17 లైంగిక దోపిడీ కేసులు, మొత్తం 52 పిల్లలపై నేరాల కేసులు నమోదయ్యాయి. 2021లో రాష్ట్రంలో ప్రతిరోజూ నమోదయింది. పిల్లలపై నేరాల దశాబ్ద విశ్లేషణ (2011-2021) రాష్ట్రంలో పిల్లలపై నేరాల కేసుల్లో 337 శాతం భారీ పెరుగుదలను చూపిస్తుందని తెలిపారు.

మృత్యు విహారం

- పర్యాటక పడవ బోల్తా
- అవుకు జలాశయంలో ఘటన
- ఇద్దరి మృతి, ఒకరి గల్లంతు

ప్రమాదానికి గురైన బోటు

విశాలాంధ్ర -అవుకు: నంద్యాల జిల్లాలోని అవుకు జలాశయంలో విషాదం చోటుచేసుకుంది. పర్యాటక శాఖ పడవ ఒక్కసారిగా బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా, మరో మహిళ గల్లంతయ్యారు. తొమ్మిది మంది ప్రాణాలతో బయటపడ్డారు. మరో మహిళ గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... స్పెషల్ బ్రాంచ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న దూదేకుల రసూల్ బాషా తన కుటుంబ సభ్యులు, బంధువులైన 12 మంది (మహేశ్వరి, సైదా, సాజిదా, దస్తగిరి, కాసింబి, హసీనా భాను, చెస్విక్, హనీ, హాశియ, మహబూబ్ బాషా హుస్సేన్‌బీ, బషీర్ బాష, నూర్జహాన్)తో కలిసి అవుకు జలాశయానికి చేరుకున్నారు. అందరూ కలిసి ఫ్యామిలీ పడవలో జలాశయంలోకి వెళ్లారు. కొంతసేపు బాగానే జల విహారం చేసి తిరుగు ప్రయాణమయ్యారు. అయితే బోటులోకి నీరు రావడంతో మునిగిపోయింది. రసూల్ బాషా, ఆయన కుమార్తె సైదాలకు ఈత రావడంతో ఒక్కొక్కరిని పడవపైకి చేర్చి కాపాడే ప్రయత్నం చేశారు. కానీ రసూల్ కూతురు షాజిదా, మరో అమ్మాయి హాసియా పడవలో ఇరుక్కుపోయారు. అతి కష్టం మీద ఒడ్డుకు చేరిన వారికి వైద్య పరీక్షలు నిర్వ హించగా హాసియా అప్పటికే మృతి చెందినట్లు తేలింది. కాగా నూర్జహాన్, చస్విక్, హనీలను వైద్యం కోసం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నూర్జహాన్ పరిస్థితి విషమంగా ఉండడంతో నంద్యాలకు తరలించగా అక్కడ మృతి చెందింది. షాజిదా గల్లంతు కావడంతో ఆచూకీ కోసం సహాయ బృందాలు గాలింపు చర్యలు చేపట్టారు. సంఘటన స్థలాన్ని డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఆర్డీవో వెంకటరెడ్డి, అవుకు తహసిల్దార్ శ్రీనివాసులు, కోవెలకుంట్ల, బనగానపల్లి సీఐలు ఆదినారాయణ రెడ్డి, ప్రియతమరెడ్డి సందర్శించారు. అవుకు కొలిమిగుండ్ల ఎస్ఐలు జగదీశ్వర్ రెడ్డి, రమేష్ రెడ్డిల అధ్వర్యంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

మృతి చెందిన హసియ

పడవ ప్రమాదం బాధాకరం

అవుకు జలాశయంలో పడవ ప్రమాదం చాలా బాధాకరమని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి అన్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని వైసీపీ యువ నాయకుడు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, బనగానపల్లె శాసనసభ్యుడు కాటసాని రామిరెడ్డి కుమారుడు కాటసాని ఓబుల్ రెడ్డి, చల్లా రఘునాథ్ రెడ్డి, దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి సందర్శించి మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు.

నిర్వాహకుల నిర్లక్ష్యమే...

పడవ ప్రమాదానికి నిర్వాహకుల నిర్లక్ష్యమే కారణమని బాధితులలో ఒకరైన దూదేకుల రసూల్ బాషా తెలిపారు. ప్రమాదం జరిగే సమయంలో పడవ డ్రైవరు నీటిలోకి దూకేశాడని ఒకరిని కూడా కాపాడే ప్రయత్నం చేయలేదని వాపోయారు. నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లనే తమ కుటుంబ సభ్యుల ప్రాణాలు కోల్పోయామని ఆవేదన చెందారు.

జాతీయ విద్యా విధానంపై ఐక్య పోరు

విద్యార్థి సంఘాల పిలుపు

న్యూఢిల్లీ: జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)కి వ్యతిరేకంగా ఐక్య పోరాటానికి విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. విద్యా విధానంలో రాష్ట్రాల హక్కులకు భంగం కలిగించే, విద్యార్థి వ్యతిరేక ఎన్ఈపీ విధానాన్ని అప్రజాస్వామికంగా అమలు చేయడాన్ని నిరసిస్తూ ఉమ్మడి ఆందోళన చేపట్టాలని సంఘాల నాయకులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఫీజుల పెంపు, పాఠశాలల మూసివేత, ఉపకార వేతనాల కోత, నిరుద్యోగం, రిజర్వేషన్లు, సామాజిక న్యాయం, కేంద్ర విద్యా సంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యలు, ఒకే భాష, సంస్కృతి అమలు వంటి అనేక కీలక అంశాలపై వారు చర్చించారు. ఐక్య విద్యార్థి ఉద్యమం కోసం డిమాండ్ల చార్టర్‌ను తయారు చేయడానికి ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడి హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో విద్యార్థి సంఘాల సన్నాహక సమావేశం శనివారం జరిగింది. ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు వీపీ సాను అధ్యక్షతన జరిగినఈ సమావేశానికి దేశంలోని పది ప్రముఖ విద్యార్థి సంఘాల నాయకులు హాజరయ్యారు. ఆర్ఎస్ఎస్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న విద్య కేంద్రీకరణ, కాషాయీకరణ, వ్యాపారీకరణకు వ్యతిరేకంగా ఐక్య విద్యార్థి ఉద్యమం ప్రాముఖ్యతను ఈ సమావేశంలో చర్చించారు. దేశం కోసం ప్రత్యామ్నాయ ప్రగతిశీల, శాస్త్రీయ, లౌకిక, ప్రజాస్వామ్య విద్యా అజెండాను సిద్ధం చేయడంపై సమావేశంలో చర్చించారు. ఎన్ఈపీ అప్రజాస్వామిక అమలును ప్రతిఘటించడానికి ఆయా రాష్ట్రాల్లో ప్రజాస్వామ్య, ప్రగతిశీల, లౌకిక విద్యార్థి ఉద్యమాల ఉమ్మడి వేదికలను ఏర్పాటుచేయాలని నాయకులు నిర్ణయించారు. ఈ సమావేశంలో విక్కీ మహేశ్వర్, ఇంజమాముల్ హసన్, ఎండి అమీనుయేల్ హసన్ (ఏఐఎస్ఎఫ్),మయూఖ్ బిస్వాస్, ఆదర్శ్ ఎం. సాజీ (ఎస్ఎఫ్ఐ), నితీష్ గౌర్ (ఎన్ఎస్‌యూఐ), ప్రసేన్‌జిత్ (ఏఐఎస్ఏ), ఎజియరాసన్, ఎస్. మోహన్ (డిఎంకె విద్యార్థి విభాగం), ఎం.డి. సఫివుల్లా (పీఎస్‌యూ), గౌతమ్ కేఆర్ (ఏఐఎస్‌బీ), అరవింద్ బి, కలియపరుమాల్ (ఎస్ఎఫ్‌డి), ఏఐఎస్‌బీ, సీవైఎస్ఎస్, స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ద్రవిడియన్ నేతలు పాల్గొన్నారు. విద్యార్థి ఐక్య పోరాటాల్లో భాగస్వామ్యమవుతామని సీఆర్‌జేడీ, సమాజ్‌వాదీ ఛత్ర సంఘర్ష్, పీఎస్ఎఫ్ సంఘాలు ప్రకటించాయి.

కోరంగిలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆటోను ఢీకొట్టిన బస్సు
- ఏడుగురు మహిళా కార్మికుల దుర్మరణం

విశాలాంధ్ర బ్యూరో-కాకినాడ: వారంతా రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబాలకు చెందిన బీద మహిళలు. కోరంగి మండలంలోని సీతారామపురంలో రొయ్యలఫ్యాక్టరీలో కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరంతా ఆదివారం ఆటోలో ఇళ్లకు తిరిగొస్తుండగా మృత్యువు వెంటాడింది. ప్రైవేటు బస్సు బలంగా ఆటోను ఢీకొట్టింది. జాతీయ రహదారి 216పై జరిగిన ఈ ప్రమాదంలో ఆరుగురు మహిళలు అక్కడిక్కడే మృతిచెందారు. వివరాల్లోకి వెళితే... యానాం, నీలపల్లి ప్రాంతాలకు చెందిన కొంత మంది మహిళలు సీతారామపురం రొయ్యల ఫ్యాక్టరీలో విధులు ముగించుకుని ఆటోలో ఇంటికి తిరిగి వస్తున్నారు. ఈ సమయంలో అమలాపురం నుంచి వస్తున్న ప్రైవేటుబస్సు తాళ్లరేవు మండలం కోరింగ పంచాయతీ సుబ్బారాయుడు దిమ్మ వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో తిరగబడి నుజ్జునుజ్జవడంతోపాటు అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు మహిళలు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ప్రమాదంలో క్షతగాత్రులను కాకినాడ జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మరొకరు మృతిచెందారు. మృతదేహాలకు జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి బంధువుల సాయంతో మృతులెవరనేది గుర్తించారు. మృతుల్లో సేశెట్టి వెంకటలక్ష్మి(మెట్టకూరు యానాం), కర్రి పార్వతి(యానాం), బొక్కా అనంతలక్ష్మి (ఫ్రాన్స్‌తిప్ప), నిమ్మకాయల వెంకటలక్ష్మి(కురసాంపేట), చింతపల్లి జ్యోతి (యానాం), కల్లి పద్మ(యానాం), గూడపనేటి సత్యవతి(ఫ్రాన్స్‌పేట) ఉన్నారు. రోడ్డు ప్రమాద ఘటన తెలుసుకున్న యానాం ఎమ్మెల్యే అశోక్, ముమ్మిడివరం ఎమ్మెల్యే సతీష్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కన్నబాబు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. జీజీహెచ్‌కు వచ్చిన క్షతగాత్రులకు మెరుగైన చికిత్సకోసం మెడికవర్ ఆసుపత్రికి తరలించాలని ఆదేశించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కర్నాటక తీర్పు బీజేపీకి

మింగుడు పడటంలేదు: జైరాం రమేశ్

న్యూఢిల్లీ: కర్నాటక ఇచ్చిన తీర్పును బీజేపీ అంగీకరించలేకపో తోందని కాంగ్రెస్ విమర్శించింది. ఆ పార్టీకి చెందిన ఆన్‌లైన్ విద్వేష కర్మాగారం అదనపు పనిగంటలు శ్రమిస్తోందని ఎద్దేవాచేసింది. విభజన రాజకీయాలు, అబద్ధాల సృష్టిలో బీజేపీ నిమగ్నమైందని దుయ్యబట్టింది. కర్నాటకలో కాంగ్రెస్ అఖండ విజయాన్ని సాధించడం, పట్టున్న ఏకైక దక్షిణాది రాష్ట్రాన్ని కోల్పోవడం బీజేపీకి మింగుడు పడటం లేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. 'కర్నాటకలోని అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారు. అఖండ విజయాన్ని అందించారు. ఇది బీజేపీ జీర్ణించుకోలేక పోతోంది. అందుకే అబద్ధాలను సృష్టించే పనిలో పెడింది. ఇందకోసం ఆ పార్టీకి చెందిన ఆన్‌లైన్ విద్వేష ఫ్యాక్టరీ అదనపు పనిగంటలు శ్రమిస్తోంది. బహుశ ప్రధాని అనుసరించే విద్వేష-విభజన రాజకీయాలతో ప్రభావితం అయ్యేనేమో!' అని జైరాం రమేశ్ ట్వీట్ చేశారు. కర్నాటకలో కాంగ్రెస్ గెలిచిన తర్వాత భత్కల్ అంటూ బీజేపీ ఐటీ శాఖాధిపతి అమిత్ మాళవియా చేసిన విమర్శలకు ఆయన తనదైన శైలిలో బదులిచ్చారు. మాళవియా ట్విట్టర్‌లో ఓ వీడియోను పెట్టారు. అందులో నెలవంక ఉన్న పచ్చజెండాను ఒకరు ఎగురవేస్తున్నారు. దీనికి 'కాంగ్రెస్ గెలుపు తర్వాతి భత్కల్ ఇది' అని మాళవియా క్యాప్షన్ పెట్టారు. బెళగావిలో జరిగినదంటూ మరొక వీడియోను ఆయన పోస్టుచేశారు. ఆపై 'భత్కల్ నుంచి బెళగావి వరకు ప్రేమ దుకాణం ఇలానే ఉంటుంది. కర్నాటకలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతుండటాన్ని పోలీసులు చూస్తున్నారు. అటు బెళగావిలో రెచ్చగొట్టే విధంగా నినాదాలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ మెప్పు రాజకీయాలు కర్నాటక సామాజాన్ని ఛిద్రం చేస్తుంది' అని వ్యాఖ్యానించారు. మాళవీయా విమర్శలకు జైరాం రమేశ్ పై విధంగా స్పందించారు.

క్రైస్తవంలోకి మారి గుజరాత్ గిరిజనులు

ఐఏఎస్... ఐపీఎస్‌లయ్యారు

కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆరోపణ

బనస్కాంత: కొన్నేళ్ల క్రితం క్రైస్తవ మతంలోకి మారిన చాలా మంది గిరిజన వర్గాల ప్రజలు ఇప్పుడు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా మారుతున్నారని గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఒకరు ఆరోపించారు. శనివారం బనస్కాంత జిల్లాలోని భభార్ గ్రామంలో వాల్మీకి కమ్యూనిటీకి చెందిన జంటల సామూహిక వివాహ వేడుకలో కాంగ్రెస్ శాసనసభ్యుడు జెనిబెన్ ఠాకూర్ మాట్లాడుతూ హిందూ మతాన్ని రక్షించడానికి పని చేస్తున్న మత గురువులు ఇతర మతాలలోకి మారకుండా నిరోధించడానికి 'విప్లవాత్మక చర్యలు' తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అయితే ఈ కార్యక్రమంలో ఠాకూర్‌తో వేదిక పంచుకున్న బీజేపీ ఎమ్మెల్యే, గుజరాత్ అసెంబ్లీ స్పీకర్ శంకర్ చౌదరి మాట్లాడుతూ ఐఏఎస్, ఐపీఎస్ అయ్యే అవకాశం చూసి ఆకర్షితులై క్రైస్తవ మతాన్ని స్వీకరించిన గిరిజనులు అది తప్పుడు వాగ్దానమని తర్వాత గ్రహించారని తెలిపారు. 'గిరిజన ప్రాంతాల ప్రజలు సంవత్సరాల క్రితం క్రైస్తవ మతాన్ని స్వీకరించారు. నేడు వారు ఐఏఎస్, ఐపీఎస్ మమ్లత్దార్ (రెవెన్యూ అధికారి), డీడీవో (జిల్లా అభివృద్ధి అధికారులు) అయ్యారు. గుజరాత్‌లో ప్రభుత్వ ఉద్యోగాలు ఉన్న గిరిజనుల్లో ఎక్కువ మంది క్రైస్తవ మతంలోకి మారిన వారు ఉన్నారు' అని వావ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయిన ఠాకూర్ ఈ కార్యక్రమంలో అన్నారు. షెడ్యూల్డ్ కులాల వారు కూడా బౌద్ధమతం పట్ల ఆకర్షితులవుతున్నారని ఆమె అన్నారు. 'ఈ వర్గాల కోసం మనం విప్లవాత్మక చర్యలు తీసుకోకపోతే, రాబోయే కాలంలో వారు ఇతర మతాలలోకి మారతారని హిందూ మతాన్ని రక్షించడానికి కృషి చేసే మత గురువులు, నాయకులకు నా విజ్ఞప్తి' అని తెలిపారు. గిరిజన, దళిత వర్గాల ప్రజలకు రక్షణ, గౌరవం కల్పిస్తే వారు ఇతర మతాల్లోకి మారడం గురించి ఆలోచించరని ఠాకూర్ అన్నారు. 'మన మతాన్ని కాపాడుకోవడానికి, వారికి సామాజిక సేవలను అందించడంలో మనం ముందుండాలి' అని అన్నారు. అయితే కొంతమంది తమ పిల్లలను ఐఏఎస్‌లుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చి మత మార్పిడి వైపు ఆకర్షితులను చేస్తున్నారని చౌదరి చెప్పారు. జూన్ 2021లో రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం గుజరాత్ మత స్వేచ్ఛ (సవరణ) చట్టాన్ని ఆమోదించింది. ఇది వివాహం ద్వారా బలవంతంగా లేదా మోసపూరితంగా మత మార్పిడికి జరిమానా విధించబడుతుంది.గుజరాత్ మత స్వేచ్ఛా చట్టం-2003కి 2021 సవరణ బలవంతపు మత మార్పిడులను మరింత నిషేధించడానికి, అరికట్టడానికి ఉద్దేశించబడింది. కొన్ని నెలల తర్వాత, గుజరాత్ హైకోర్టు సవరించిన చట్టంలోని కొన్ని సెక్షన్లను తదుపరి విచారణ పెండింగ్‌లో ఉంచింది. దీంతో హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది.

మేలో రూ.23 వేల కోట్ల విదేశీ పెట్టుబడులు

న్యూఢిల్లీ: విదేశీ పెట్టుబడిదారులు మే నెలలో భారత ఈక్విటీలపై బలమైన కొనుగోలు ఆసక్తిని కనబరిచారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరింత రేటు పెంపుదల అవకాశాలు తక్కువగా ఉండటం, బలమైన దేశీయ స్థూల దృక్పథం, మంచి సంపాదన సీజన్ కారణంగా మొదటి పక్షం రోజుల్లో రూ.23,152 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టారు. దీంతో ఇప్పుడు ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) 2023లో ఇప్పటివరకు రూ.8,572 కోట్లను ఆకర్షించడం ద్వారా ఈక్విటీల నికర కొనుగోలుదారులుగా మారారని డిపాజిటరీల వద్ద అందుబాటులో ఉన్న సమాచారం పేర్కొంది. 'రూపాయి బలంగా ఉండటం, సమీప కాలంలో డాలర్ క్షీణించే అవకాశం ఉన్నందున, ఎఫ్‌పీఐలు భారతదేశంలో కొనుగోళ్లను కొనసాగించే అవకాశం ఉంది.

పూరీ కొత్త చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'

హైదరాబాద్: మొత్తానికి చాలా రోజుల తరువాత దర్శకుడు పూరీ జగన్నాథ్ తన రాబోయే చిత్రం పేరును, విడుదల తేదీని కూడా ఒకే సారి ప్రకటించేశాడు. రామ్ పోతినేనితో 'ఇస్మార్ట్ శంకర్' సినిమా తీసి మంచి విజయాన్ని నమోదు చేసుకొని, మళ్లీ పరిశ్రమలో నిలబడగలిగేట్టు చేసుకున్న పూరీ జగన్నాథ్... దీనికి సీక్వెల్‌ను ప్రకటించాడు. ఆ సీక్వెల్ కి 'డబుల్ ఇస్మార్ట్' అని పేరు పెట్టాడు. ఇది పూరి జగన్నాధ్, ఛార్మి కాంబినేషన్ లోనే ఉంటుంది. వాళ్లిద్దరూ మొదలెట్టిన పూరి కనెక్ట్స్ మీద ఈ సినిమాని నిర్మించనున్నారు. రామ్ పోతినేని పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమాని ప్రకటించారు. ఇది తెలుగుతో పాటు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో కూడా విడుదల అవుతుందని చెప్పారు. అలాగే ఇది మార్చ్ 8, 2024 సంవత్సరంలో విడుదల అవుతుందని కూడా ప్రకటించేశారు. పూరి జగన్నాధ్ తొందరగా సినిమాలు తీయటంలో నేర్పరి. అందుకని ఈ సినిమా ఈ సంవత్సరం మొదలుపెట్టి వచ్చే సంవత్సరానికి పూర్తి చేసేట్టుగా పెట్టుకున్నాడు. పూరి జగన్నాథ్, ఛార్మి కాంబినేషన్‌లో విజయ్ దేవరకొండ, అనన్య పాండే జంటగా నటించిన 'లైగర్' పాన్ ఇండియా సినిమా డిజాస్టర్ అయిన సంగతి అందరికీ తెలిసిందే. ఈ సినిమా వలన చాలా నష్టపోయాం అంటూ కొంతమంది డిస్ట్రిబ్యూటర్లు నిరసన వ్యక్తం చేస్తున్న సంగతి కూడా తెలిసిందే. అంతే కాక, ఈ సినిమాలో నటించిన విజయ్ దేవరకొండకి కూడా పూర్తి పారితోషికం ఇవ్వలేదని తెలిసింది. ఇటువంటి నేపథ్యంలో పూరి జగన్నాధ్ కొత్త సినిమా ప్రకటించటం సినీ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది.

వెంకీ దర్శకత్వంలో దుల్కర్‌సల్మాన్

హైదరాబాద్: సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ నిర్మాణ సారథ్యంలో దుల్కర్ సల్మాన్ ఇంకో తెలుగు సినిమా చేస్తున్నాడు. ఈసారి దర్శకుడు వెంకీ అట్లూరితో చేతులు కలిపాడు. ఈ సినిమా అన్ని భాషల్లోనూ విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు. వెంకీ ఆమధ్య ధనుష్‌తో 'సర్' అనే సినిమా తెలుగు, తమిళ భాషల్లో తీసి విజయం సాధించాడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ ఈ సినిమాని నిర్మించాయి. ఆ విజయంతో మళ్లీ ఈ రెండు సంస్థలు... వెంకీ అట్లూరితోనే ఇంకో పాన్ ఇండియా సినిమాని ప్లాన్ చేశాయి. అయితే ఈసారి ఇందులో నటించబోయేది ఎవరో తెలుసా, మలయాళం నటుడు దుల్కర్ సల్మాన్. ఈ సినిమా తెలుగు, తమిళం, మలయాళం, మిగతా భాషల్లో కూడా విడుదల అవుతుందని తెలిసింది. దుల్కర్ సల్మాన్ 'సీతారామం' సినిమాలో నటించి, పెద్ద విజయం సాధించాడు. ఈ చిత్ర షూటింగ్ అక్టోబర్ నుండి ప్రారంభమవుతుందని చిత్ర నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 2024 వేసవిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి చేస్తామని చెప్పారు.

జూన్‌లో 'బెదురులంక 2012'

హైదరాబాద్: గతేడాది అజిత్ హీరోగా నటించిన వలిమై చిత్రంలో విలన్‌గా ఆకట్టుకున్నాడు ఆర్ఎక్స్ 100 హీరో కార్తికేయ. ఈ యువ నటుడు మళ్లీ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'బెదురులంక 2012'. క్లాక్స్ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాలో నేహాశెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే విడుదలైన బెదురులంక 2012 ఫస్ట్‌లుక్ మోషన్ పోస్టర్, గ్లింప్స్ వీడియో, టీజర్ నెట్టింట్లో వైరల్ అవుతూ... సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. తాజాగా ఈ సినిమా విడుదలపై స్పష్టత ఇస్తూ... స్పెషల్ లుక్ ఒకటి విడుదల చేశారు మేకర్స్. మన బెదురు లంక 2012 వరల్డ్ ఫేమస్ అయ్యేందుకు రెడీ అయింది... అంటూ ఈ చిత్రాన్ని జూన్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్టు ప్రకటిం చారు. అయితే విడుదలయ్యేది ఏ రోజు అనేది మాత్రం సస్పెన్స్‌లో పెట్టారు.

ఆర్సీబీ చేతిలో చిత్తయిన రాజస్థాన్

జైపూర్: ఐపీఎల్ 2023లో ప్లే ఆఫ్ అవకాశాలు సజీవంగా ఉండాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో రాయల్స్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) చెలరేగింది. రాజస్థాన్ రాయల్స్‌పై సంచలన విజయాన్ని నమోదు చేసింది. 172 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్‌ను స్వల్ప స్కోరుకే ఆర్సీబీ బౌలర్లు ఆలౌట్ చేశారు. రాజస్థాన్ ఇన్నింగ్స్ ఆరంభంలోనే పార్నెల్ చెలరేగి 3 వికెట్లను పడగొట్టాడు. ఆ తర్వాత బ్రేస్‌వెల్, కరణ్‌శర్మ చెరో 2 వికెట్లు, మహ్మద్ సిరాజ్, గ్లేన్ మ్యాక్స్‌వెల్ చెరో వికెట్ తీయడంతో కేవలం 59 పరుగులకే రాజస్థాన్ రాయల్స్ ఆలౌట్ అయ్యింది. దీంతో ఏకంగా 112 పరుగుల తేడాతో ఆర్సీబీ ఘనవిజయం సాధించింది. దీంతో పాయింట్ల పట్టికలో 5వ స్థానానికి దూసుకెళ్లింది. రాజస్థాన్ రాయల్స్ 6వ స్థానానికి పడిపోయింది. రాజస్థాన్ బ్యాటర్లలో హెట్మేయర్ (35) మినహా మిగతా బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు. ఓపెనర్లు యశశ్వి జైస్వాల్, జాస్ బట్లర్ ఇద్దరూ డకౌట్ అయ్యారు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ సంజూ శాంసన్ (4), జో రూట్ (10), దేవధూత్ పడిక్కల్ (4), షిమ్రోన్ హెట్మేయర్ (35), ధ్రువ్ జురెల్ (1), రవిచంద్రన్ అశ్విన్ (0), ఆడమ్ జంపా (2), సందీప్ శర్మ (0), కేఎం అసిఫ్ (0) చొప్పున పరుగులు చేశారు.

ప్లేఆఫ్స్ రేసుకు దిల్లీ దూరం

న్యూఢిల్లీ: యువ ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (65 బంతుల్లో 103-10 ఫోర్లు, 6 సిక్సర్లు) చెలరేగడంతో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 16వ సీజన్‌లో పంజాబ్ ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా ఉంచుకుంది. శనివారం జరిగిన రెండో మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ 31 పరుగుల తేడాతో దిల్లీ క్యాపిటల్స్‌ను చిత్తు చేసింది. తాజా సీజన్‌లో వార్నర్ సేనకు ఇది 8వ పరాజయం కాగా.. ఆ జట్టు ప్లే ఆఫ్స్ రేసుకు దూరమైంది. మొదట పంజాబ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. ప్రభ్‌సిమ్రన్ ఒంటరి పోరాటం చేయగా, 20 పరుగులు చేసిన సామ్ కరన్ రెండో అత్యధిక స్కోరర్ అంటే పంజాబ్ ఇన్నింగ్స్ ఎలా సాగిందో అర్థం చేసుకోవచ్చు. కెప్టెన్ శిఖర్ ధవన్ (7), లివింగ్‌స్టోన్ (4), జితేశ్ శర్మ (5), షారుక్ ఖాన్ (2)విఫలమయ్యారు. దిల్లీ బౌలర్లలో ఇషాంత్ శర్మ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో దిల్లీ 18.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 130 పరుగులకు పరిమితమైంది.

కెప్టెన్ డేవిడ్ వార్నర్ (27 బంతుల్లో 54 పరుగులు-10 ఫోర్లు, ఒక సిక్సర్), ఫిల్ సాల్ట్ (21) రాణించడంతో ఒక దశలో 69/0తో పటిష్టంగా కనిపించిన దిల్లీ... ఆ తర్వాత.. హర్‌ప్రీత్ (4/30), రాహుల్ చాహర్ (2/16) ధాటికి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి పరాజయం పాలైంది.

మృత్యువుతో పోరాడుతున్న హీత్ స్ట్రీక్

హరారే: జింబాబ్వే క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, ఆల్‌రౌండర్ హీత్ స్ట్రీక్ మృత్యువుతో పోరాడుతున్నాడు. స్టేజ్-4 క్యాన్సర్‌తో బాధపడుతూ దక్షిణాఫ్రికాలో చికిత్స పొందుతున్న స్ట్రీక్ పరిస్థితి విషమంగా ఉందని జింబాబ్వే క్రీడా మంత్రి డేవిడ్ కౌల్టర్ ట్విట్టర్ ద్వారా తెలిపారు. హీత్ స్ట్రీక్ కోలుకోవాలని ప్రార్థించాలని ఆ దేశ క్రికెట్ సంఘం పిలుపునిచ్చింది. జింబాబ్వే గొప్ప క్రికెటర్లలో ఒకరైన హీత్ స్ట్రీక్ అనారోగ్యంతో బాధపడుతున్నాడని, అతని కోసం ప్రార్థించాలని డేవిడ్ కౌల్టర్ కోరారు. అయితే, హీత్ స్ట్రీక్ పెద్దపేగు, కాలేయ క్యాన్సర్ స్టేజ్-4 దశలో ఉంది. క్యాన్సర్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో దక్షిణాఫ్రికాలోని ప్రముఖ అంకాలజిస్ట్ వద్ద చికిత్స పొందుతున్నాడు. కాగా హీత్‌స్ట్రీక్ ఆరోగ్యంపై వస్తున్న వార్తలపై గోప్యత పాటించాలని మాజీ క్రికెటర్ కుటుంబం కోరింది. హీత్ స్ట్రీక్ మొదటిసారిగా నవంబర్ 1993లో దక్షిణాఫ్రికాతో చిన్నస్వామి స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ వన్డే మ్యాచ్ ఆడాడు. డిసెంబర్ 1993లో పాకిస్థాన్‌పై టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. చివరిసారిగా అంతర్జాతీయ వన్డే మ్యాచ్‌ను ఆగస్ట్ 2002లో న్యూజిలాండ్‌పై ఆడగా, చివరి టెస్టును సెప్టెంబర్ 2005లో భారత్‌తో ఆడాడు. హీత్ తన కెరీర్‌లో సచిన్ టెండూల్కర్‌ను మూడుసార్లు, సౌరవ్ గంగూలీని నాలుగుసార్లు అవుట్ చేశాడు. తన చివరి అంతర్జాతీయ మ్యాచ్‌లో భారత్‌తో జరిగిన హరారే టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో హీత్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. భారత జట్టులో సగం మందిని పెవిలియన్‌కు పంపాడు. ఆ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో హీత్ 32 ఓవర్లలో 73 పరుగులిచ్చి ఆరు వికెట్లు పడగొట్టాడు. అయితే, హీత్ స్ట్రీక్ అద్భుత ప్రదర్శన చేసినప్పటికీ, ఆ మ్యాచ్‌లో టీమిండియా 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది. హీత్ స్ట్రీక్ జింబాబ్వే తరఫున 65 టెస్టులు, 189 వన్డేలకు ప్రాతినిథ్యం వహించాడు. టెస్టుల్లో 1990 పరుగులు, వన్డేల్లో 2943 పరుగులు చేశాడు. టెస్టుల్లో హీత్ ఒక సెంచరీ, 11 అర్ధ సెంచరీలు సాధించగా, వన్డేల్లో 13 అర్ధ సెంచరీలు నమోదు చేశాడు. టెస్టుల్లో 216 వికెట్లు, వన్డేల్లో 239 వికెట్లు పడగొట్టాడు. టెస్టుల్లో 73 పరుగులకు ఆరు వికెట్లు, వన్డేల్లో 32 పరుగులు ఇచ్చి ఐదు వికెట్లు తీసి కెరీర్‌లో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేశాడు. ఇక ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టుకు కోచ్‌గానూ వ్యవహరించాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.